

తొలివెలుగు జాతీయపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 9491134365

TGTEL/26/A6221

# తొలివెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం.. జాతీయపత్రిక

TOLE VELUGGU JATIYAPATRIKA

**విలేకరులు కావలెను**


తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9491134365

| యాదాద్రిభువనగిరి | సంపుటి: 01 | సంచిక | బుధవారం | 2.సెప్టెంబర్.2026 | ఎడిటర్: యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వేల రూ. 2/ |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvangiri | Volume: 01 | Issue.37 | Wednesday | 2.9.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |



# ఉగ్రవాదం ఎవరికీ వ్యూహాత్మక
# ఆస్తి కాకూడదు



- ఎస్‌సీఓ సదస్సులో ప్రధాని మోదీ స్పష్టీకరణ
- ఉగ్రవాద వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని పిలుపు
- ఉగ్రవాదంపై పోరులో ద్వంద్వ ప్రమాణాలకు తావులేదని వెల్లడి
- భద్రత, అనుసంధానం, అవకాశాలే భారత్ ప్రాధాన్యాలని స్పష్టీకరణ

**బిష్కెక్:** ఉగ్రవాదాన్ని ఏ దేశమూ తన వ్యూహాత్మక ప్రయోజనాల కోసం ఉపయోగించుకోరాదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదానికి సంబంధించిన మొత్తం వ్యవస్థను సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులకు నిధులు సమకూర్చడం, యువతను ఉగ్రవాద సంస్థల్లోకి ఆకర్షించడం, తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేయడం, వారికి సురక్షిత స్థావరాలు కల్పించడం వంటి అన్ని అంశాలపై సమష్టిగా పోరాడాలని సూచించారు. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరుగుతున్న 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు.

ఎస్‌సీఓలో భారత్ దృష్టికోణాన్ని వివరిస్తూ.. భద్రత, అనుసంధానం, అవకాశాలు మూడు కీలక అంశాలని ప్రధాని పేర్కొన్నారు. శాంతి, భద్రతకు భారత్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. యూరేషియా ప్రాంతంలో శాంతి, సుస్థిరత కొనసాగాలంటే అఫ్గానిస్థాన్‌లోనూ పరిస్థితులు మెరుగుపడాల్సిన అవసరం ఉందని చెప్పారు. అఫ్గాన్ ప్రజల అభివృద్ధి, మానవతా అవసరాల కోసం భారత్ అందిస్తున్న సహకారం భవిష్యత్తులోనూ కొనసాగుతుందని తెలిపారు.

### పశ్చిమాసియా సంక్షోభంపై ఆందోళన

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలపైనా ప్రధాని మోదీ స్పందించారు. ఒక ప్రాంతంలో ప్రారంభమైన ఘర్షణ అక్కడికే పరిమితం కాదని, దాని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఇంధన భద్రత, సముద్ర వాణిజ్యం, సరఫరా వ్యవస్థలపై పడుతుందని వివరించారు. ఈ సంక్షోభాల కారణంగా గ్లోబల్ సౌత్ దేశాలే ఎక్కువగా నష్టపోతున్నాయని అన్నారు. యుద్ధాలు, ఉద్రిక్తతలకు యుద్ధభూమిలో పరిష్కారం లభించదని, తరువాయి 2లో

## కేసీ వేణుగోపాల్‌తో
# రేవంత్‌రెడ్డి భేటీ

- గంటకుపైగాసమావేశం.. రాష్ట్ర తాజా రాజకీయ పరిణామాలపై చర్చ
- కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారాలపై ఆరా
- మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీపైనా మంతనాలు
- వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై సమీక్షించినట్లు సమాచారం



**న్యూఢిల్లీ:** తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సుదీర్ఘంగా భేటీ అయ్యారు. దాదాపు గంటకుపైగా సాగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలు, కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన, పార్టీ వ్యవహారాలపై చర్చించినట్లు సమాచారం. ముఖ్యంగా మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యవహారాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది.

మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ తదితర అంశాలు కూడా సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణకు అధిష్ఠానం ఆమోదం పొందడంతో పాటు, నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసే అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి చర్చించినట్లు సమాచారం.

### సురేఖకు అధిష్ఠానం పిలుపు

మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ అధిష్ఠానం ఢిల్లీకి పిలిపించడంతో ఆమె హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. కేసీ వేణుగోపాల్‌తో ఆమె భేటీ కానున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్ కూడా సురేఖ కోరినట్లు సమాచారం. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఢిల్లీకి చేరుకున్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, స్పీకర్ గడ్డం తరువాయి 2లో

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి



- వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనలో విధ్వంసమే
- ఫీజుల బకాయిలతో విద్యార్థులను వేధిస్తున్న కాలేజీలు
- సర్టిఫికెట్లు అందక ఉద్యోగాలు, పైచదువులకు దూరమవుతున్న విద్యార్థులు
- మాజీ మంత్రి హరీశ్‌రావు

2

### ఆర్టీసీలో 1,500 కండక్టర్ పోస్టులు



- త్వరలో ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు
- హైదరాబాద్‌లో మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులు
- ఇందిరమ్మ ఇళ్ల కోసం ఆర్టీసీ స్థలాలు ఇచ్చేందుకు సిద్ధం
- మంత్రి పొన్నం ప్రభాకర్

2

## నేపాల్‌లో వరద బీభత్సం..
# మృతుల సంఖ్య 1,003

2

- ఆరో రోజూ కొనసాగుతున్న సహాయక, గాలింపు చర్యలు
- దాదాపు 4 వేల మంది గల్లంతు.. 583 మంది విదేశీయులు
- 700 మృతదేహాలకు సామూహిక ఖననం
- రెస్క్యూ ఆపరేషన్‌లో 21 వేల మంది భద్రతా సిబ్బంది
- ఇప్పటివరకు 12 వేల మందిని సురక్షితంగా తరలింపు






## హైదరాబాద్‌లో లండన్, నార్త్‌ఈస్టర్న్
# వర్సిటీల క్యాంపస్‌లు

- భారత్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లో అంతర్జాతీయ వర్సిటీల ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు
- గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా నగరాన్ని తీర్చిదిద్దే దిశగా తెలంగాణ సర్కారు అడుగులు
- హార్వర్డ్ వర్సిటీ కోర్సులపైనా ఆసక్తి
- విదేశీ పర్యటనల్లో రేవంత్ బృందం చర్చల ఫలితంగా కీలక ఒప్పందాలు

2

### ఇరాన్ ఒక్క రాకెట్‌కు.. యూఎస్ మూడు ఇంటర్‌సెప్టర్లు!

- ఆరు నెలల యుద్ధంలో భారీగా తరిగిపోయిన అమెరికా ఆయుధ నిల్వలు
- పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్లలో 65శాతం తగ్గుదల
- ఒక్క డ్రోన్ లేదా క్షిపణిని కూల్చేందుకు రెండు, మూడు ఇంటర్‌సెప్టర్లు
- ఆయుధ ఉత్పత్తి పెంచాలని రక్షణ సంస్థలపై పెంటగాన్ ఒత్తిడి


2

## రామచందర్‌రావుకు
# నితిన్ నబీన్ ఫోన్



- బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడి, నేతల హౌస్ అరెస్టులపై ఆరా
- నల్లగొండ బీజేపీ జిల్లా అధ్యక్షుడి ఇంటిపై దాడి వివరాలు తెలుసుకున్న జాతీయ అధ్యక్షుడు
- ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం కొనసాగించాలని నితిన్ నబీన్ సూచన

## ప్రభుత్వానికి ఊరట



- కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌పై స్టే ఎత్తివేత
- సింగిల్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేసిన సీజే ధర్మాసనం
- 2014 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలపై స్టే విధించడాన్ని సర్కార్ సవాల్
- పిటిషనర్‌కు ఈ పథకాలతో ప్రత్యక్ష సంబంధం లేదన్న ఏజీ

2



## రంగనాథ్‌కు హైకోర్టులో
# బిగ్ రిలీఫ్

- సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై తాత్కాలిక స్టే
- కమిషనర్ పదవి నుంచి తప్పించాలన్న ఆదేశాలపై డివిజన్ బెంచ్ జోక్యం
- వివాదాస్పద భూమిలో హైడ్రా జోక్యం చేసుకోవద్దని స్పష్టీకరణ
- తదుపరి విచారణ నవంబర్ 3కి వాయిదా

## కేసీ వేణుగోపాల్‌తో రేవంత్‌రెడ్డి భేటీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రసాద్‌కుమార్ కూడా దిల్లీలో ఉన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా దిల్లీ వెళ్లనున్నట్లు తెలుస్తోంది.

### అధిష్ఠానానికి టీపీసీసీ నివేదిక

ఇటీవల గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ సురేఖకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీనిపై ఆమె కమిటీ ఛైర్మన్ మల్లు రవికి వివరణ ఇచ్చారు. ఇదే సమయంలో వనపర్తి వ్యవహారానికి సంబంధించి ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై కూడా క్రమశిక్షణ కమిటీ నివేదిక రూపొందించింది. ఈ రెండు వ్యవహారాలపై టీపీసీసీ రూపొందించిన నివేదికలను పార్టీ అధిష్ఠానానికి పంపినట్లు సమాచారం. దీంతో దిల్లీ పర్యటనలో సురేఖ వ్యవహారంపై ఎలాంటి నిర్ణయం వెలువడుతుందనే ఉత్కంఠ నెలకొంది.

## హైదరాబాద్‌లో లండన్, నార్త్‌ఈస్టర్న్ వర్సిటీల క్యాంపస్‌లు

**హైదరాబాద్:** ప్రపంచ స్థాయి విద్యా సంస్థలకు హైదరాబాద్ గమ్యస్థానంగా మారుతోంది. అంతర్జాతీయ విద్యా కేంద్రంగా నగరాన్ని అభివృద్ధి చేసే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. బ్రిటన్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీ ఆఫ్ లండన్, అమెరికాలోని బోస్టన్‌కు చెందిన నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయనున్నాయి. భారత్‌లో ఈ రెండు విశ్వవిద్యాల యాలు తొలిసారిగా తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయను ండటం విశేషం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం బ్రిటన్‌లో పర్యటించింది. అమెరికా పర్యటనకు ముఖ్యమంత్రికి కేంద్రం అనుమతి లభించకపోవడంతో అధికారుల బృందం అక్కడ పర్యటించింది. ఈ పర్యటనల్లో భాగంగా అంతర్జాతీయ విద్యాసంస్థల ప్రతినిధులతో జరిగిన ఉన్నతస్థాయి చర్చలు ఫలించాయి. దీంతో యూనివర్సిటీ ఆఫ్ లండన్, నార్త్‌ఈస్టర్న్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకొచ్చాయి.

### హార్వర్డ్ కూడా ఆసక్తి

ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం కూడా తెలంగాణలో స్వల్పకాలిక ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లతో పాటు వివిధ కోర్సులను అందించేందుకు ఆసక్తి చూపినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ తదితర ప్రపంచస్థాయి విద్యాసంస్థలతోనూ తెలంగాణ ప్రతినిధులు చర్చలు జరిపినట్లు పేర్కొంది.

### యువతకు అంతర్జాతీయ విద్య

అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు తెలంగాణతో భాగస్వామ్యం కావడం రాష్ట్రానికి గర్వకారణమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. నైపుణ్యాభివృద్ధి, విద్య, క్రీడలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర యువత ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా హైదరాబాద్‌లోనే అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. జాతీయ విద్యా విధానం ద్వారా విదేశీ విశ్వవిద్యాలయాలకు కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ హైదరాబాద్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అంతర్జాతీయ వర్సిటీల క్యాంపస్‌ల ఏర్పాటు ద్వారా ఉన్నత విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో నగరానికి మరింత ప్రాధాన్యం లభించనుంది.

## ఆర్టీసీలో 1,500 కండక్టర్ పోస్టులు

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీలో 1,500 కండక్టర్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. సంస్థలో దాదాపు 4 వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ కూడా తుది దశకు చేరుకుందని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో పాటు.. సంస్థను మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు చేపడుతోందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులకు ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. నిత్యం 65 లక్షల మందికిపైగా ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగించుకుంటున్నారని చెప్పారు. సంస్థలో త్వరలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తామని వెల్లడించారు.

### ఇందిరమ్మ ఇళ్లకు స్థలాలు ఇస్తాం

ఆర్టీసీకి చెందిన స్థలాలను ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రభుత్వానికి ఇస్తే తప్పేంటని పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ప్రభుత్వం, ఆర్టీసీ వేర్వేరు కాదని.. రెండూ ప్రజా ప్రయోజనాల కోసమే పనిచేస్తున్నాయని స్పష్టం చేశారు. గతంలో ప్రభుత్వం ఆర్టీసీకి వందల ఎకరాల భూమిని కేటాయించిన విషయాన్ని గుర్తుచేశారు. పేదల కోసం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైతే ఆర్టీసీ స్థలాలను తప్పకుండా ఇస్తామని తెలిపారు.

### రవాణా రంగంలో మార్పులు

హైదరాబాద్‌లో ఆర్డినరీ బస్సుల సంఖ్య తగ్గలేదని మంత్రి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో రవాణా రంగంలో అనేక సంస్కరణలు, మార్పులు తీసుకొచ్చిందన్నారు. ప్రజలకు మెరుగైన ప్రజా రవాణా అందించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. హైదరాబాద్ నగరంలో త్వరలో మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయని పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

## పాక్ పీఎంఓ వక్రబుద్ధి.. మోదీని తొలగించి ఎస్‌సీఓ గ్రూప్ ఫొటో

### పాక్ తీరుపై నెటిజన్ల తీవ్ర విమర్శలు

**బిష్కెక్:** కిర్గిస్థాన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) సదస్సు సందర్భంగా పాకిస్థాన్ మరోసారి తన వక్రబుద్ధిని ప్రదర్శించింది. సదస్సుకు హాజరైన 10 సభ్య దేశాల అధినేతలు కలిసి దిగిన గ్రూప్ ఫొటోను పాకిస్థాన్ ప్రధాని కార్యాలయం (పీఎంఓ) వక్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసింది. అసలు ఫొటోలో ఉన్న భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు మరికొందరు దేశాధినేతలను తొలగించి, మిగిలిన చిత్రాన్ని ఎక్స్ వేదికగా పంచుకుంది. ఈ ఫొటోలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దేశాధినేతల మధ్యలో ఉన్నట్లు కనిపించేలా ఉంది. ఫొటోకే పరిమితం కాకుండా ఎస్‌సీఓ నాయకుల రౌండ్‌టేబుల్ సమావేశానికి సంబంధించిన వీడియోను కూడా పాక్ పీఎంఓ ఎడిట్ చేసింది. అందులో ప్రధాని మోదీ కనిపించే భాగాన్ని తొలగించి రూపొందించిన వీడియోను షెహబాజ్ షరీఫ్ తన అధికారిక ఫేస్‌బుక్ ఖాతాలో షేర్ చేశారు. ఈ చర్యపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ప్రధాని మోదీ మాత్రం ఎస్‌సీఓ సదస్సుకు హాజరైన అన్ని దేశాల అధినేతలు ఉన్న అసలు గ్రూప్ ఫొటోను తన అధికారిక ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. అందులో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా ఉన్నారు.

# నేపాల్‌లో వరద బీభత్సం.. మృతుల సంఖ్య 1,003

**కాఠ్మాండు:** నేపాల్‌ను అతలాకుతలం చేసిన వరదలు, భారీ వర్షాల కారణంగా మృతుల సంఖ్య వెయ్యి దాటింది. గల్లంతైన వారి కోసం ఆరో రోజూ సహాయక, గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు సహాయక బృందాలు 1,003 మృతదేహాలను వెలికితీశాయి. మరోవైపు దాదాపు 4 వేల మంది ఆచూకీ ఇంకా లభించలేదు. గల్లంతైన వారిలో 583 మంది విదేశీయులు, 83 మంది భద్రతా సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు భద్రతా దళాలు సుమారు 12 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు.



### టిబెట్‌లోనూ విషాదం

భారీ వర్షాలు, వరదల ప్రభావం టిబెట్‌పైనా పడింది. అక్కడ 16 మంది ప్రాణాలు కోల్పోగా.. మరో 550 మంది ఆచూకీ లభించలేదని చైనా మీడియా వెల్లడించింది.

### 700 మృతదేహాలకు సామూహిక ఖననం

నేపాల్‌లోని వివిధ ప్రాంతాల్లో వెలికితీసిన మృతదేహాలను దేశవ్యాప్తంగా 21 ఆసుపత్రులకు తరలిస్తున్నారు. తమ వారి ఆచూకీ కోసం బాధిత కుటుంబాలు గల్లంతైన వారి ఫొటోలు పట్టుకుని ఆసుపత్రుల వద్ద పడిగాపులు కాస్తున్నాయి. మృతదేహాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతుండటంతో వాటిని భద్రపరచడం అధికారులకు సవాలుగా మారింది.
చాలా మృతదేహాలు గుర్తుపట్టలేని స్థితిలో ఉండటం, కొన్ని ప్రాంతాల్లో శరీర భాగాలు మాత్రమే లభ్యమవుతుండటంతో వాటిని గుర్తించడం కష్టంగా మారింది. ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల్లో కేవలం 60 మాత్రమే కుటుంబ సభ్యులకు అప్పగించారు. దాదాపు 700 మృతదేహాల నుంచి నమూనాలను సేకరించి భద్రపరిచిన అనంతరం వాటిని సామూహికంగా ఖననం చేసినట్లు అధికారులు తెలిపారు.

### 21 వేల మందితో రెస్క్యూ

నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో ఇంకా వర్షాలు కురుస్తుండటంతో నదుల్లో నీటిమట్టం పెరుగుతోంది. మరిన్ని వరదలు సంభవించే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రభావిత ప్రాంతాల్లో దాదాపు 21 వేల మంది భద్రతా సిబ్బంది సహాయక, సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. హెలికాప్టర్ల ద్వారా వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రోడ్లు, వంతెనలు ధ్వంసమైన ప్రాంతాల్లో చిక్కుకుపోయిన ప్రజలకు ఆహారం, అత్యవసర సామగ్రిని అందిస్తున్నారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మంచికంటే సృష్టిం చిన విధ్వంసమే ఎక్కువని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్యానికి విద్యార్థుల పరిస్థితులే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాల యాజ మాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచే స్తున్నాయని ఆరోపించారు.
ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పిం చారు. ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లిం చకపోవ డంతో పలు కళాశాలలు విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయని హరీశ్‌రావు అన్నారు. కష్టపడి చదువుకున్నప్పటికీ సర్టిఫికెట్లు చేతికి అందకపో వడంతో ఉద్యోగాల్లో చేరలేక, ఉన్నత విద్య కోసం ముందుకు వెళ్లలేక విద్యార్థులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటు న్నారని పేర్కొన్నారు.
ప్రతిపక్షాలపై అసత్య ప్రచారం చేయడంపై ఉన్న శ్రద్ధ.. క్షేత్రస్థాయిలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంపై ఎందుకు లేదని హరీశ్‌రావు ప్రశ్నించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.
కాంగ్రెస్ ప్రభుత్వానికి వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేసిన హరీశ్‌రావు.. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేసి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

## ఉగ్రవాదం ఎవరికీ వ్యూహాత్మక ఆస్తి కాకూడదు

(మొదటి పేజీ తరువాయి)

చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని భారత్ మొదటి నుంచీ చెబుతోందని మోదీ పేర్కొన్నారు.

### యువతకు డ్రగ్స్ పెను ముప్పు

మాదకద్రవ్యాల అక్రమ రవాణా యువతతో పాటు ప్రాంతీయ భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమిస్తోందని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్ ట్రాఫికింగ్‌ను అడ్డుకునేందుకు ఎస్‌సీఓ పరిధిలోని సంబంధిత వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. భద్రతా ముప్పులు, వ్యవస్థీకృత నేరాలు, సమాచార భద్రత, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన ఎస్‌సీఓ యంత్రాంగాలు కేవలం చర్చల వేదికలుగా కాకుండా.. ఆచరణాత్మక సమన్వయం, సకాలంలో చర్యలు తీసుకునే వ్యవస్థలుగా మారాలని పిలుపునిచ్చారు.

### ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరాలి

ఎస్‌సీఓ సహకారం ద్వారా లభించే ప్రయోజనాలు నేరుగా ప్రజలకు చేరాలని ప్రధాని ఆకాంక్షించారు. ప్రజల మధ్య సంబంధాలే సంస్థ సహకారానికి అతిపెద్ద బలమని పేర్కొన్నారు. రానున్న 25 ఏళ్లలో ఎస్‌సీఓ సహకారంలో ప్రజల మధ్య సంబంధాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. యువతకు ఎన్ని కొత్త అవకాశాలు కల్పించాం? వ్యాపారవేత్తలకు ఎన్ని కొత్త మార్కెట్లు అందుబాటులోకి వచ్చాయి? సాంకేతికత ద్వారా రైతులకు ఎంత ప్రయోజనం చేకూరింది? ప్రజల జీవన ప్రమాణాలు ఎంత మెరుగయ్యాయి? అనే అంశాలే సంస్థ విజయాన్ని అంచనా వేసే అసలైన కొలమానాలని మోదీ పేర్కొన్నారు.

### ఒకే ఫ్రేమ్‌లో మోదీ, జిన్‌పింగ్, పుతిన్, షరీఫ్

ఇదిలా ఉండగా, ఎస్‌సీఓ సదస్సులో సభ్య దేశాల అధినేతలు కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఈ ఫొటోలో ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఒకే ఫ్రేమ్‌లో కనిపించారు. ఈ సందర్భంగా మోదీ.. జిన్‌పింగ్, పుతిన్‌లతో కాసేపు ముచ్చటించారు.

# ప్రభుత్వానికి ఊరట



**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలుపై సింగిల్ బెంచ్ విధించిన మధ్యంతర స్టేను ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం ఎత్తివేసింది. పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలుపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.
2014 నుంచి అమల్లో ఉన్న ఈ రెండు సంక్షేమ పథకాలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోలను సవాల్ చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో.. పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపికైన లబ్ధిదారులకు కూడా చెల్లింపులు చేయరాదని ఆదేశించారు.

### పిటిషనర్‌కు ప్రత్యక్ష సంబంధం లేదు

ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ. సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. 2014 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలను సవాల్ చేస్తూ పిటిషన్ దాఖలైందని తెలిపారు. అయితే ఈ పథకాల అమలుతో పిటిషనర్‌కు ఎలాంటి ప్రత్యక్ష నష్టం జరగడం లేదని, ఆయన హక్కులకు ఎలాంటి భంగం కలగలేదని పేర్కొన్నారు. అంతేకాకుండా పిటిషనర్ ఆయా పథకాల లబ్ధిదారు కూడా కాదని తెలిపారు. అందువల్ల దీనిని ప్రజాప్రయోజన వ్యాజ్యంగా పరిగణించలేమని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. షాదీముబారక్ తరహా పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిందని, కల్యాణలక్ష్మి కూడా అదే తరహా సంక్షేమ పథకమని ఏజీ వివరించారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేస్తూ దాఖలైన ఈ పిటిషన్‌పై సింగిల్ బెంచ్ విచారణ జరపడం సరికాదని వాదించారు. పథకాల అమలుపై విధించిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం స్టేను ఎత్తివేసింది.

### గత నెల 12న స్టే

కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల అమలును నిలిపివేస్తూ గత నెల 12న హైకోర్టు సింగిల్ బెంచ్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. 2014 నుంచి ఈ పథకాల కోసం ప్రభుత్వం జారీ చేసిన ఎనిమిది జీవోల అమలుపై స్టే విధించింది. వాటి కింద ఎంపికైన లబ్ధిదారులకు ఎలాంటి చెల్లింపులు చేయరాదని కూడా ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా.. తాజాగా సింగిల్ బెంచ్ ఉత్తర్వులను ధర్మాసనం రద్దు చేసింది.

## రంగనాథ్‌కు హైకోర్టులో బిగ్ రిలీఫ్

**హైదరాబాద్:** హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఆయనను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తప్పించి, ఆ స్థానంలో మరొకరిని నియమించాలంటూ సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను డివిజన్ బెంచ్ తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి సంబంధించిన వివాదాస్పద భూమిలో హైడ్రా జోక్యం చేసుకోవద్దని ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 3కు వాయిదా వేసింది. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ సందర్భంగా సింగిల్ బెంచ్ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తప్పించి, ఆయన స్థానంలో మరొక అధికారిని నియమించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించింది.
ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ రంగనాథ్ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించారు.

### హైడ్రా నిబంధనల ప్రకారమే పనిచేసింది

రంగనాథ్ తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు. హైడ్రా తనకు నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగానే వ్యవహరిం చిందని తెలిపారు. కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై విచారణ జరిపిన సింగిల్ బెంచ్ స్వల్ప వ్యవధిలోనే కమిషనర్‌ను పదవి నుంచి తప్పించాలంటూ ఉత్తర్వులు ఇవ్వడం సరికాదని వాదించారు. శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఆధీనంలో ఉన్న భూమిపై వివాదం ఉందని తెలిపారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకే హైడ్రా ఏర్పాటైందని, పురాతనమైన, చారిత్రక ప్రాధాన్యం ఉన్న కొండరాళ్లను తొలగిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు అధికారులు అక్కడికి వెళ్లారని వివరించారు. ఈ భూమికి సంబంధించి సుప్రీంకోర్టులోనూ పిటిషన్ దాఖలు చేసినట్లు కోర్టుకు తెలిపారు.

### హైడ్రా ఎలా నిర్ధారిస్తుంది?

వివాదాస్పదంగా ఉన్న భూమిని హైడ్రా అధికారులు ఎందుకు కూల్చివేశారని ధర్మాసనం ప్రశ్నించింది. చట్టప్రకారం ప్రతి ఒక్కరూ వ్యవహరించాల్సిందేనని స్పష్టం చేసింది. భూమి శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీకి చెందుతుందని కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పుడు.. దాన్ని ప్రభుత్వ భూమిగా హైడ్రా ఎలా నిర్ధారించిందని ప్రశ్నించింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తూ హైడ్రా అధికారులు పోలీసుల సహకారంతో కంపెనీ ఆధీనంలోని నిర్మాణాలను తొలగించారని కంపెనీ తరఫు వాదనలు వినిపించినట్లు సమాచారం. మరోవైపు జియో సెన్సింగ్ సర్వే ఆధారంగా ఆ భూమి ప్రభుత్వానిదేనని రంగనాథ్ తరఫు న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. రంగనాథ్‌ను హైడ్రా కమిషనర్ పదవి నుంచి తప్పించాలంటూ సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను తాత్కాలికంగా సస్పెండ్ చేసింది.

## రామచందర్‌రావుకు నితిన్ నబీన్ ఫోన్

**హైదరాబాద్:** తెలంగాణలో చోటుచేసుకున్న తాజా రాజకీయ పరిణామాలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఆరా తీశారు. ఆ పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావుకు ఫోన్ చేసి రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలపై వివరాలు తెలుసుకున్నారు. సోమవారం తెలంగాణ బీజేపీ రాష్ట్ర కార్యాలయం గేట్లకు యువజన కాంగ్రెస్ నాయకులు నల్లరంగు వేయడం, బీజేపీ నేతలను హౌస్ అరెస్ట్ చేయడం వంటి పరిణామాలపై ఆయన ఆరా తీసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన వైఫల్యాలపై బీజేపీ ఆందోళనలు చేపడుతున్న నేపథ్యంలో తమపై దాడులు జరిగాయని రామచందర్‌రావు వివరించినట్లు సమాచారం. నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడి విషయాన్ని కూడా జాతీయ అధ్యక్షుడి దృష్టికి తీసుకెళ్లారు.
పోరాటం కొనసాగించండి
ప్రజా వ్యతిరేక విధానాలపై పార్టీ శ్రేణులు ఇదే విధంగా పోరాటం కొనసాగించాలని రామచందర్‌రావుకు నితిన్ నబీన్ సూచించినట్లు సమాచారం. పార్టీ నేతలకు ఎలాంటి పరిస్థితుల్లోనైనా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డికి కూడా ఫోన్ చేసి మాట్లాడతానని తెలిపారు.

### అరాచకాలను అడ్డుకోలేని ప్రభుత్వం

తెలంగాణలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నప్పుడు మౌనంగా ఉండే ప్రభుత్వ యంత్రాంగం.. బాధితులకు అండగా నిలిచేందుకు బీజేపీ నాయకులు వెళ్తే మాత్రం వారిని అరెస్టు చేస్తోందని నితిన్ నబీన్ 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి రాహుల్‌గాంధీ చెప్పే మాటలు కేవలం నాటకమని విమర్శించారు. తెలంగాణలో కొనసాగుతున్న నియంతృత్వ పాలనకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని నితిన్ నబీన్ పేర్కొన్నారు.

## ఇరాన్ ఒక్క రాకెట్‌కు.. యూఎస్ మూడు ఇంటర్‌సెప్టర్లు!

**వాషింగ్టన్:** అమెరికా – ఇరాన్ మధ్య యుద్ధం ఆరు నెలలు దాటిన నేపథ్యంలో అగ్రరాజ్యానికి కొత్త సవాలు ఎదురవుతోంది. ఇరాన్ దాడులను అడ్డుకునేందుకు పెద్దఎత్తున ఇంటర్‌సెప్టర్లను ప్రయోగిస్తుండటంతో అమెరికా కీలక ఆయుధాల నిల్వలు వేగంగా తగ్గిపోతున్నట్లు అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా పేట్రియా ట్, థాడ్ ఇంటర్‌సెప్టర్లతో పాటు తోమహాక్, ఏటీఏసీఎంఎస్ వంటి సుదూర లక్ష్యాలను ఛేదించే క్షిపణుల నిల్వలపైనా ఒత్తిడి పెరుగుతున్నట్లు సమాచారం. ఇరాన్ ప్రయోగించే డ్రోన్‌లు, క్షిప ణులను కూల్చేందుకు అమెరికా కొన్ని సందర్భాల్లో ఒక లక్ష్యానికి రెండు, మూడు ఇంటర్‌సెప్టర్లను వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో తక్కువ ఖర్చుతో కూడిన ఇరాన్ ఆయుధాలను ఎదుర్కొనేందుకు అమెరికా అత్యంత ఖరీదైన రక్షణ క్షిపణులను భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది.

### 65 శాతం పేట్రియాట్ నిల్వలు ఖాళీ

'సెంటర్ ఫర్ స్ట్రాటజిక్ అండ్ ఇంటర్నేషనల్ స్టడీస్' (సీఎస్ఐఎస్) విశ్లేషణ ప్రకారం.. ఫిబ్రవరి నుంచి జులై మధ్య అమెరికా పేట్రియాట్ ఇంటర్‌సెప్టర్ల నిల్వల్లో సుమారు 65 శాతం వినియో గమయ్యా యి. యుద్ధానికి ముందు దాదాపు 2,330 పేట్రి యాట్ ఇంటర్‌సెప్టర్లు అందుబాటులో ఉండగా.. ప్రస్తుతం ఆ సంఖ్య 850లోపునకు పడిపోయినట్లు అంచనా. అంటే 1,500కుపైగా ఇంటర్‌సెప్టర్లను అమెరికా ఇప్పటికే ఉపయోగించింది.

### ఒక్క లక్ష్యానికి రెండు, మూడు

ఇరాన్ డ్రోన్‌లు, క్షిపణులను అడ్డుకునే క్రమంలో అమెరికా కమాండర్లు ఒక్కో లక్ష్యంపై రెండు, మూ డు ఇంటర్‌సెప్టర్లను ప్రయోగిస్తున్నట్లు సీఎస్ఐఎస్ విశ్లేషణ పేర్కొంది. దీనివల్ల ఆయుధ నిల్వలు మరింత వేగంగా క్షీణిస్తున్నాయి. ఇదే సమయంలో యుద్ధానికి ముందు స్థాయులతో పోలిస్తే థాడ్ ఇంటర్‌సెప్టర్ల లభ్యత కూడా 38 శాతం తగ్గినట్లు నివేదికలు చెబుతున్నాయి. తోమహాక్, ఏటీఏసీఎంఎస్ వంటి దీర్ఘశ్రేణి క్షిపణుల నిల్వలు కూడా గణనీయంగా తగ్గినట్లు సమాచారం.

### ఉత్పత్తి పెంచాలని ఒత్తిడి

తరిగిపోతున్న ఆయుధ నిల్వలను తిరిగి పెంచేం దుకు



అమెరికా రక్షణశాఖ చర్యలు వేగవంతం చేసింది. ఆయుధాల తయారీని భారీగా పెంచేలా రక్షణ సంస్థలపై ఒత్తిడి తెస్తోంది. ఉత్పత్తి సామర్థ్యాన్ని దూకుడుగా పెంచేందుకు ప్రణాళికలు సమర్పించాలని రక్షణ పరిశ్రమలకు ఆ శాఖ ఉపమంత్రి స్టీవ్ ఫీన్‌బెర్గ్ ఇటీవల లేఖ రాశారు. ఆయుధ ఉత్పత్తిని పెంచేందుకు ఏళ్ల తరబడి సమయం తీసుకుంటామని చెప్పడాన్ని అంగీ కరించబోమని ఆయన స్పష్టం చేసినట్లు సమాచారం. ముప్పును ఎదుర్కొనేందుకు అవస రమైన ఆయుధ నిల్వలను పెంచడంపై పెంటగాన్ దృష్టి సారించిందని ఆ శాఖ అధికార ప్రతినిధి సియాన్ పార్నెల్ వెల్లడించారు. ఇరాన్‌తో కొనసాగుతున్న ఘర్షణ నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అమెరికా తన ఆయుధ నిల్వలను వేగంగా పునరుద్ధరించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## వాయుసేనలో చరిత్ర సృష్టించిన శక్తి శర్మ



**న్యూఢిల్లీ:** భారత వైమానిక దళంలో మహిళా అధికారుల ప్రస్థానంలో మరో చారిత్రక అధ్యాయం నమోదైంది. ఎయిర్ వైస్ మార్షల్ లేదా దానికి సమానమైన హోదా పొందిన తొలి మహిళా వైద్యేతర అధికారి శక్తి శర్మ రికార్డు సృష్టించారు. మంగళవారం న్యూఢిల్లీలోని ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో అసిస్టెంట్ చీఫ్ ఆఫ్ ది ఎయిర్ స్టాఫ్ (ఎడ్యుకేషన్)గా ఆమె బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎయిర్ కమోడోర్ హోదాలో ఉన్న ఆమెకు తాజాగా ఎయిర్ వైస్ మార్షల్‌గా పదోన్నతి లభించింది. ఈ విషయాన్ని భారత వైమానిక దళం 'ఎక్స్' వేదికగా వెల్లడించింది. 1994లో వాయుసేన విద్యా విభాగంలో అధికారిగా చేరిన శక్తి శర్మ.. తన సుదీర్ఘ కెరీర్‌లో వివిధ కీలక బాధ్యతలు నిర్వర్తించారు. వైమానిక దళ శిక్షణ సంస్థలు, ఫీల్డ్ స్టేషన్లు, కమాండ్ హెడ్‌క్వార్టర్స్, ఎయిర్ హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహించారు. విద్యా రంగంలోనూ ఆమె విశేష కృషి చేశారు. ఐఐటీ కాన్పూర్, పుణె విశ్వవిద్యాలయంలో 'ఐఏఎఫ్ చైర్ ఆఫ్ ఎక్సలెన్స్'లను ఏర్పాటు చేయడంలో కీలక పాత్ర పోషించారు.

### సైనిక పాఠశాలకు ప్రిన్సిపల్‌గా పనిచేసిన తొలి మహిళా అధికారి

త్రివిధ దళాల నుంచి సైనిక పాఠశాల ప్రిన్సిపల్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళా అధికారిగానూ శక్తి శర్మ గతంలో గుర్తింపు పొందారు. విద్యా రంగంలో, సైనిక శిక్షణలో ఆమె అందించిన సేవలు ప్రత్యేకమైనవని వాయుసేన పేర్కొంది. మూడు దశాబ్దాలకుపైగా విశిష్ట సేవలతో ఆమె దేశంలోని మహిళా అధికారులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని తెలిపింది.

# క్లీన్ ఎనర్జీతోనే పర్యావరణ పరిరక్షణ: డాక్టర్ లావు రత్తయ్య

## విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** వాతావరణ మార్పులను అరికట్టడానికి, సుస్థిర అభివృద్ధి సాధించడానికి క్లీన్ ఎనర్జీ (హరిత ఇంధన) సాంకేతికతలు ఎంతగానో తోడ్పడతాయని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో సెప్టెంబరు 10 నుంచి 12 వరకు నిర్వహించనున్న 'హార్నెసింగ్ క్లీన్ ఎనర్జీ టెక్నాలజీస్' జాతీయ సదస్సు బ్రోచర్‌ను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఐసీటీఈ 'ఆ సైట్–వాణి' పథకం కింద మాతృభాషలో ఈ సదస్సును నిర్వహించడం అభినందనీయమన్నారు. మాతృభాషలోనే బోధన సాగడం వల్ల విద్యార్థుల్లో పరిశోధనా ఆలోచనలు, సృజనాత్మకత పెంపొందుతాయని పేర్కొన్నారు.

**సెప్టెంబరు 8 వరకు ఉచిత నమోదు:**

ఈ జాతీయ సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ, రోబోటిక్స్, స్పేస్ టెక్నాలజీ, క్లీన్ ఎనర్జీ వంటి అభివృద్ధి చెందుతున్న నూతన సాంకేతిక అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు చెప్పారు. ఐఐటీ తిరుపతి, ఐఐటీ మద్రాస్, సీఎస్ఐఆర్–ఐఐసీటీ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొంటారని వెల్లడించారు. ఏఐసీటీఈ ఆమోదిత విద్యాసంస్థల అధ్యాపకులు, పరిశోధకులు సెప్టెంబరు 8వ తేదీలోపు ఉచితంగా పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ అడ్వైజర్, రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ పూనం మాలకొండయ్య, డైరెక్టర్ ప్రొఫెసర్ వైవీ దాసేశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# హామీల అమల్లో ప్రభుత్వం విఫలం: మాడుగుల

## భూదాన్‌పోచంపల్లిలో బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను నెరవేరుస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను పూర్తిగా మభ్యపెట్టిందని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చేపడుతున్న నిరసన కార్యక్రమాలపై మంగళవారం పోచంపల్లి పురపాలక కేంద్రంలో మండల, పట్టణ శాఖల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలకు ఇస్తామన్న తులం బంగారం, రూ.2500 ఆర్థిక సాయం, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్, రైతులకు రూ.15 వేల రైతు భరోసా సహా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని ఆరోపించారు. యూరియా కోసం రైతులను గోస పెడుతున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నియోజకవర్గ, మండల స్థాయిల్లో ఏడు రోజుల పాటు నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో ప్రజలు, రైతులు, నిరుద్యోగులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ పాక వెంకటేష్ యాదవ్, మండల, పట్టణ శాఖ అధ్యక్షులు పాటి సుధాకర్‌రెడ్డి, పీఎస్ఎస్ మాజీ చైర్మన్ కందడి భూపాల్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి యాదవ్, మాజీ మండల అధ్యక్షుడు సామ రవీందర్‌రెడ్డి, మండల నాయకులు కందడి సుధాకర్‌రెడ్డి, రావుల శేఖర్‌రెడ్డి, కౌన్సిలర్లు పెద్దల చక్రపాణి, రాపోలు కావ్య వేణు, మాజీ సర్పంచ్ బత్తుల శ్రీశైలం గౌడ్, పట్టణ, మండల మహిళా అధ్యక్షురాలు గూడూరు భవాని, గుండు రాజేశ్వరి, పట్టణ ప్రధాన కార్యదర్శి గునిగంటి మల్లేష్‌గౌడ్, మాజీ సర్పంచులు బండి కృష్ణగౌడ్, మన్నె పద్మారెడ్డి, నాయకులు ఫకీరు సుధాకర్‌రెడ్డి, మక్బుల్, రాజిరెడ్డి, యువజన నాయకులు చింతకింది కిరణ్, సీత శ్రవణ్, నోముల ఉపేందర్, కొండమడుగు రోషన్ తదితరులు పాల్గొన్నారు.

# సోమారంలో ఉచిత మెగా వైద్య శిబిరం

- ఘనాపూర్ మెడిసిటీ ఆధ్వర్యంలో వైద్య సేవలు.. ఉచితంగా మందుల పంపిణీ
- శిబిరాన్ని ప్రారంభించిన సర్పంచ్ గొలుసుల అనూష యాకూబ్
- పరిసర గ్రామాల ప్రజలకు వైద్య పరీక్షలు, ఆరోగ్య సలహాలుS
- ఉచిత వైద్య సేవలపై హర్షం వ్యక్తం చేసిన గ్రామస్థులు



**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండలం సోమారం గ్రామంలో ఘనాపూర్ మెడిసిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. గ్రామ సర్పంచ్ గొలుసుల అనూష యాకూబ్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సోమారం గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి వచ్చిన ప్రజలకు వైద్య నిపుణులు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి వైద్యులు పరీక్షలు చేసి, అవసరమైన ఆరోగ్య సూచనలు, సలహాలు అందించారు. వైద్యుల సూచన మేరకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. శిబిరం నిర్వహణకు సహకరించిన సర్పంచ్ అనూష యాకూబ్‌తో పాటు ఘనాపూర్ మెడిసిటీ వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఘనాపూర్ మెడిసిటీ వైద్యులు, సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




# ఇంద్రపాలనగరంలో ఆర్‌ఓ ప్లాంట్ ప్రారంభం

- కోరమండల్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు
- ప్రారంభించిన సర్పంచ్ గర్ధాస్ విక్రమ్



**తొలివెలుగు, రామన్నపేట:** మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామంలో కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ దత్తత కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సురక్షిత తాగునీటి ఆర్‌ఓ ప్లాంట్‌ను మంగళవారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం జేఏసీ రాష్ట్ర కార్యదర్శి, గ్రామ సర్పంచ్ గర్ధాస్ విక్రమ్ ఈ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న సంస్థ ప్రతినిధులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ సుబ్బారెడ్డి, ప్రతినిధులు వినయ్ పరిడా, ప్రీతమ్ స్వామీజీ, ప్రసాద్, సేల్స్ ఆఫీసర్ సంబశివారెడ్డి, సాయిప్రసన్న, వార్డు సభ్యులు వరికుప్పల స్వామి, కంబాలపల్లి సత్తయ్య, రేపాక పారిజాత యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# 9వ తేదీలోగా ఎస్ఐఆర్ ఫారమ్‌లు అందజేయాలి

- నోటీసులు అందుకున్న వారు వివరాలు పూర్తి చేసి బీఎల్ఓలకు సమర్పించాలి: జమీరోద్దీన్
- రామన్నపేటలో ఎస్ఐఆర్ ఫారమ్‌ల పంపిణీ
- గుర్తింపు పత్రాల నకళ్లు జతచేయాలని సూచన
- గడువు లోగా ఫారమ్‌లు సమర్పించాలని విజ్ఞప్తి



**తొలివెలుగు, రామన్నపేట:** ఎస్ఐఆర్ ఫారమ్‌లకు సంబంధించిన నోటీసులు అందుకున్న వారు వాటిని పూర్తిగా నింపి, సూచించిన గుర్తింపు పత్రాల నకళ్లను జతచేసి ఈ నెల 9వ తేదీలోగా సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని రామన్నపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ జమీరోద్దీన్ సూచించారు. రామన్నపేట మండలంలోని విజ్ఞాన వర్ధిని ఐటీఐ ప్రాంగణంలో నోటీసులు అందుకున్న వారికి మంగళవారం ఎస్ఐఆర్ ఫారమ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జమీరోద్దీన్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ప్రతి ఒక్కరూ ఫారమ్‌లోని వివరాలను సక్రమంగా, ఎలాంటి తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. అవసరమైన ధ్రువీకరణ పత్రాల నకళ్లను జతచేసి నిర్ణీత గడువులోగా బీఎల్ఓలకు సమర్పించాలని కోరారు. ఫారమ్‌ల సమర్పణలో ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత బీఎల్ఓలను సంప్రదించి వివరాలను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు వనం చంద్రశేఖర్, మహమ్మద్ కరీం, ఎండీ మన్నాన్, అక్కనేపల్లి జయకృష్ణ, తావ సంతోష్, ఎంకే రాహుల్, నంగునూరు విజయ్, బీఎల్ఓలు కవిత, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

# భాజపా కార్యాలయంపై దాడి ప్రజాస్వామ్యానికే విఘాతం

- నిరసనకు వెళ్లకుండా హయత్‌నగర్‌లో బీజేపీ నాయకుల గృహనిర్బంధం
- మాజీ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డితో పాటు పలువురి నిర్బంధం
- అనంతరం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలింపు
- రాజకీయంగా ఎదుర్కోలేకే దాడులకు పాల్పడుతున్నారని ఆరోపణ



**తొలివెలుగు, హయత్‌నగర్:** భాజపా రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేసి నల్లరంగు పూశారని ఆరోపిస్తూ భాజపా రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిన నిరసన కార్యక్రమానికి వెళ్లకుండా హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో పాటు పలువురు భాజపా నాయకులను పోలీసులు ముందస్తుగా గృహనిర్బంధం చేశారు. అనంతరం వారిని హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. భాజపా కార్యాలయంపై దాడి చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. రాజకీయంగా భాజపాను ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం అప్రజాస్వామిక చర్య అని పేర్కొన్నారు. గృహనిర్బంధాలు, పోలీసుల నిర్బంధాలతో భాజపా నాయకులు, కార్యకర్తలను భయపెట్టలేరని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ నిరసనలను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కళ్లెం రవీందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్, నాయకులు గంగాని శ్రీనివాస్, మధుసూదన్‌రెడ్డి, అలిమినేటి నర్సింహారెడ్డి, పారంద మహేష్, శక్తిసింగ్, ఇట్టబోయిన నర్సింహా, గోవిందచారి తదితరులు పాల్గొన్నారు.



# సీపీఎస్ రద్దు చేయాలి.. ఓపీఎస్ అమలు చేయాలి

## తపస్ జిల్లా అధ్యక్షురాలు రేపాక ఉమా డిమాండ్

## పాఠశాలల్లో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపిన ఉపాధ్యాయులు



**తొలివెలుగు, రాజాపేట:** కొత్త పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) అమలు చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షురాలు రేపాక ఉమా డిమాండ్ చేశారు. తపస్ రాష్ట్ర పిలుపు మేరకు మంగళవారం మండలంలోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో ఓపీఎస్‌ను పునరుద్ధరిస్తామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని, ఆ హామీని వెంటనే నిలబెట్టుకోవాలని కోరారు.

### ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం:

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక భద్రతకు పాత పెన్షన్ విధానమే శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే స్పందించి ఓపీఎస్‌ను అమలు చేయాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో విస్తృతమైన ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు.

# సీపీఎస్ రద్దు.. ఓపీఎస్ పునరుద్ధరణే లక్ష్యం



- 'పెన్షన్ విద్రోహ దినం' సందర్భంగా రాజాపేటలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల నిరసన
- నల్ల బ్యాడ్జీలతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన
- మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీ ప్రకటించాలని డిమాండ్
- ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించిన ఉద్యోగులు

**తొలివెలుగు, రాజాపేట:** 'పెన్షన్ విద్రోహ దినం' సందర్భంగా రాజాపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. భోజన విరామ సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగుల భవిష్యత్ భద్రతపై ఆందోళనలు నెలకొన్నాయని పేర్కొన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. మెరుగైన ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని ప్రకటించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సంబంధిత అధికారులకు సమర్పించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ కిషన్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది, ఉపాధ్యాయులు కరుణాకర్, మహేందర్, మధుసూదన్, లెనిన్, మహిపాల్‌రెడ్డి, సత్తిరెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, సరిత తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ దిష్టిబొమ్మ దహనం

- భాజపా నాయకుల అక్రమ అరెస్టుకు నిరసన
- రామన్నపేట సుభాష్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన



**తొలివెలుగు, రామన్నపేట:** నల్గొండలో భాజపా జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నివాసంపై జరిగిన ఘటనకు నిరసనగా ఆందోళనకు వెళ్లిన భాజపా నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ రామన్నపేట సుభాష్ సెంటర్‌లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన నిరసన కార్యక్రమంలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నకిరేకంటి మొగులయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నల్గొండ ఘటనకు నిరసనగా వెళ్లిన రామన్నపేట మండల భాజపా అధ్యక్షుడు బండ మధుకర్‌రెడ్డి, పార్టీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు వనం అంజయ్యలను పోలీసులు అదుపులోకి తీసుకుని 2–టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించడం సరికాదని అన్నారు. ప్రజా సమస్యలపై భాజపా చేస్తున్న పోరాటాలను అడ్డుకునేందుకే అరెస్టులకు పాల్పడుతున్నారని మొగులయ్య ఆరోపించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసే వరకు భాజపా ప్రజా పోరాటాలను కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అరెస్టు చేసిన భాజపా నాయకులను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాజపా జిల్లా కార్యవర్గ సభ్యుడు కట్ట యాదయ్య, ప్రధాన కార్యదర్శి జంగిలి సత్యనారాయణ, కార్యదర్శి బాత్క నరేష్, సీనియర్ నాయకులు జల్ల లక్ష్మీనారాయణ, రాపోలు స్వామి, దోగుపర్తి సుభాష్, అప్పం లక్ష్మీనరసయ్య, మచ్చ మహేష్, పిండం శీను, నూతల సురేష్, బాత్క సైదులు, వావిళ్ల సంతోష్, అప్పం తిరుమలయ్య, సింగణబోయిన శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- లింగోజిగూడలో రూ.40 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మధుయాష్కి గౌడ్
- సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు శ్రీకారం
- సంక్షేమ పథకాలతో ప్రజలకు అండగా ప్రభుత్వం: మధుయాష్కి
- అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక సభలు





**తొలివెలుగు, ఎల్బీనగర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తూ పలు నిర్ణయాలు తీసుకున్నామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ అన్నారు. లింగోజిగూడ డివిజన్ జానకి ఎన్‌క్లేవ్ కాలనీలో జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులకు మంగళవారం మధుయాష్కి గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు చేపట్టిన పాలనలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, నూతన రేషన్ కార్డుల మంజూరు, సన్నబియ్యం పంపిణీ వంటి పలు కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక సభలు నిర్వహిస్తామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శలు చేసిన ఆయన, తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మున్సిపల్ శాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న నేపథ్యంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కందికంటి శ్రీధర్‌గౌడ్, శాలిని, జీవన్, సోమా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ ఆకస్మిక తనిఖీ

- రికార్డులు, కేసుల దర్యాప్తుపై సమీక్ష.. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని ఆదేశం
- వివిధ విభాగాల పనితీరును పరిశీలించిన డీసీపీ బి.అనూరాధ
- సిబ్బంది సమస్యలు, సంక్షేమ అంశాలపై ఆరా
- ఫిర్యాదులను పారదర్శకంగా పరిష్కరించాలని సూచన




**తొలివెలుగు, నాగోల్:** నాగోల్ పోలీస్‌స్టేషన్‌ను ఎల్బీనగర్ డీసీపీ బి.అనూరాధ, ఐపీఎస్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల దర్యాప్తు, కేసుల నిర్వహణ తీరును ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. వివిధ విభాగాల పనితీరుతో పాటు ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్ సిబ్బందితో డీసీపీ సమావేశమై విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు, సిబ్బంది సంక్షేమానికి సంబంధించిన అంశాలపై ఆరా తీశారు. సిబ్బంది క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు.

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా స్వీకరించి, పారదర్శకంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ, ప్రతి కేసును సమగ్రంగా దర్యాప్తు చేయాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు వేగవంతమైన, బాధ్యతాయుతమైన పోలీసు సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని డీసీపీ బి.అనూరాధ సూచించారు.

## బీఆర్ఎస్ 'సమరభేరి' చూసి కాంగ్రెస్‌కు భయమెందుకు?: సట్టు తిరుమలేష్

ఆలేరు నిరసన కార్యక్రమానికి రాజాపేట నుంచి వెయ్యి మంది



**తొలివెలుగు, రాజాపేట:** కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు చేసిన దగాపై బీఆర్ఎస్ పార్టీ మోగించిన సమరభేరిని చూసి ఆ పార్టీ నాయకులకు భయమెందుకని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ ప్రశ్నించారు. మంగళవారం రాజాపేటలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

**నేడు ఆలేరులో నిరసన:**

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 12 డిక్లరేషన్లు, 420 హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆలేరులో నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి రాజాపేట మండలం నుంచి వెయ్యి మంది శ్రేణులు, ప్రజలు తరలివెళ్లనున్నట్లు తెలిపారు. ప్రజలకు న్యాయం జరిగే వరకు ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే ఉంటామని, బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచి పోరాడుతుందని స్పష్టం చేశారు.

## టీజీపీఓఏ జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజాపేట ఎస్ఐ తకియుద్దీన్

నియామక పత్రం అందజేసిన జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్




**తొలివెలుగు, రాజాపేట:** తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీపీఓఏ) యాదాద్రి భువనగిరి జిల్లా ఉపాధ్యక్షుడిగా రాజాపేట ఎస్ఐ ఎం.డి. తకియుద్దీన్ ఎంపికయ్యారు. మంగళవారం ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించిన ఎన్నికల్లో 34 మంది సభ్యులతో ఎగ్జిక్యూటివ్ బాడీ, నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా సి.హెచ్. యాదగిరి, ఉపాధ్యక్షుడు–Iగా చౌటుప్పల్ సీఐ జి. మన్మథ కుమార్, ఉపాధ్యక్షుడు–IIగా రాజాపేట ఎస్ఐ ఎం.డి. తకియుద్దీన్, కార్యదర్శిగా బి. శ్రీశైలం ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ ఐపీఎస్ అభినందించి నియామక పత్రాలను అందజేశారు. రాజాపేట ఎస్ఐ తకియుద్దీన్‌కు జిల్లా స్థాయిలో కీలక బాధ్యతలు దక్కడం పట్ల మండల అఖిలపక్ష నాయకులు, విలేకరులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

## భాజపా నాయకుల అరెస్టు

- నాగం వర్షిత్‌రెడ్డి నివాసంపై దాడికి నిరసనగా చిట్యాలలో ధర్నా
- ఆందోళన చేపట్టిన భాజపా నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రాజకీయాల్లో దాడులకు తావులేదన్న భాజపా నేతలు
- ఘటనను ఖండించాలని ప్రజాస్వామ్యవాదులకు పిలుపు

**తొలివెలుగు, చిట్యాల:** భాజపా జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నివాసంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారంటూ ఆరోపిస్తూ, దీనికి నిరసనగా చిట్యాలలో ధర్నా చేపట్టిన భాజపా నాయకులను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా భాజపా నాయకులు మాట్లాడుతూ.. వర్షిత్‌రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు భౌతిక దాడికి పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు. రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించుకోవాలి తప్ప భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఇటువంటి ఘటనలకు తావు ఉండకూడదని, ప్రజాస్వామ్యవాదులంతా ఈ ఘటనను ఖండించాలని వారు కోరారు. నిరసన తెలిపే తమ హక్కును అడ్డుకోవడం సరికాదని పేర్కొంటూ, అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో భాజపా పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, పూరెల్ల శ్రీనివాస్, చిక్కెన్‌మెట్ల అశోక్, గంజి గోవర్ధన్, కంచర్ల శంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## నేత్రదానంతో మరొకరి జీవితంలో వెలుగులు

- నేత్రదానంపై విస్తృత అవగాహన కల్పించాలి: డాక్టర్ సుపర్ణ
- దాతల కుటుంబాలు, ఎన్జీవోలు, వాలంటీర్లు, కార్నియా సర్జన్లకు సన్మానం
- కార్నియా అంధత్వం నివారణకు ఐ బ్యాంకులు, ఎన్జీవోలు కలిసి పనిచేయాలి




**తొలివెలుగు, బాగ్‌లింగంపల్లి:** నేత్రదానం ప్రాముఖ్యతపై ప్రజల్లో మరింత విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. సుపర్ణ అన్నారు. 41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని వాసన్ ఐ బ్యాంక్, వాసన్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నేత్రదాన ఉద్యమానికి విశేష సేవలందిస్తున్న దాతల కుటుంబాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వాలంటీర్లు, కార్నియా సర్జన్లను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ సుపర్ణ మాట్లాడుతూ.. సమాజంలో కార్నియా అంధత్వాన్ని తగ్గించేందుకు ఐ బ్యాంకులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. నేత్రదానం ద్వారా చూపు కోల్పోయిన వారికి కొత్త వెలుగును అందించే అవకాశం ఉంటుందని, ఈ విషయంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వాసన్ ఐ కేర్ హాస్పిటల్ కార్నియా సర్జన్ డాక్టర్ శ్రీవిణ్య మాట్లాడుతూ.. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. దివ్యాంగశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పి. మహేష్ మాట్లాడుతూ.. చూపు లేకపోవడం వల్ల కలిగే బాధ తనకు తెలుసని, అందుకే నేత్రదానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. వాసన్ ఐ బ్యాంక్ ప్రతినిధి అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. నేత్రదానాన్ని మరింత విస్తృతం చేసేందుకు జిల్లాల స్థాయిలో కార్నియా రికవరీ సెంటర్ల ఏర్పాటుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన సుమారు 80 మంది ఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.






## ప్రజారోగ్య రక్షణలో రాజీ లేదు

- రోగుల వివరాలు, ఉచిత మందుల పంపిణీపై ఆరా
- బాలింత ఇంటికి వెళ్లి తల్లి, శిశువు ఆరోగ్యంపై పరిశీలన
- అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార వివరాల సేకరణ
- ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియపై బీఎల్ఓలతో సమీక్ష

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో ఆరోగ్య సిబ్బంది ఎలాంటి అలసత్వం వహించవద్దని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. భూదాన్ పోచంపల్లి మండలం పిల్లాయిపల్లి గ్రామంలో మంగళవారం ఆయన పల్లె దవాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వస్తున్న రోగుల వివరాలు, వారికి అందిస్తున్న ఉచిత మందులు, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. వైద్య సిబ్బందిని వివిధ అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**బాలింత ఇంటికి వెళ్లి ఆరోగ్యంపై ఆరా:**

ఇటీవలే బిడ్డకు జన్మనిచ్చిన తేజస్విని అనే బాలింత ఇంటికి కలెక్టర్ స్వయంగా వెళ్లి తల్లి, శిశువు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్.. పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, ఇతర సేవల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియ తీరుపై బీఎల్ఓలతో సమీక్ష నిర్వహించారు.

**బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి:**

ఈ సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో ఎలాంటి రాజీ లేకుండా ఆరోగ్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన సేవలను సమర్థవంతంగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పెరమాండ్ల మహాలక్ష్మి దానయ్య, ఉపసర్పంచ్ బంధారపు లక్ష్మణ్‌గౌడ్, మండల వైద్యాధికారి శ్రీవాణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలి



**తొలివెలుగు, చిట్యాల:** ఈ నెల 5న నకిరేకల్‌లో నిర్వహించనున్న సీఎం బహిరంగ సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ చిట్యాల పట్టణ అధ్యక్షుడు ఎద్దులపురి కృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం చిట్యాల పట్టణంలోని 3, 5, 10, 12 వార్డుల్లో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నకిరేకల్‌లో సీఎం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో అభివృద్ధి, సంక్షేమం జోడు గుర్రాల్లా ముందుకు సాగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ పాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు.

సీఎం బహిరంగ సభకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కృష్ణ కోరారు. ఈ సమావేశాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జడల చిన్న మల్లయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్, వైస్ చైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మి సైదులు, పాటి మాధవరెడ్డి, పాటి నర్సిరెడ్డి, వనమా వెంకటేశ్వర్లు, కోమటిరెడ్డి రామిరెడ్డి, జట్టా చంద్రకాంత్, కదారి దేవి, రంగ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## గద్దె దిగాకే బీఆర్ఎస్‌కు ప్రజలపై కపట ప్రేమ: నమిల మహేందర్ గౌడ్

రాజాపేటలో బీఆర్ఎస్ వైఖరిపై ధ్వజమెత్తిన కాంగ్రెస్

'420' ఆరోపణలకు కాంగ్రెస్ శ్రేణుల గట్టి కౌంటర్



**తొలివెలుగు, రాజాపేట:** తెలంగాణ ఆవిర్భావం తర్వాత కోటి ఆశలతో రెండు దఫాలుగా అధికారాన్ని కట్టబెడితే ప్రజల నెత్తిపై అప్పుల భారాన్ని మోపిన బీఆర్ఎస్, ఇప్పుడు అధికారం కోల్పోయాక కపట ప్రేమ చూపుతోందని రేణిగుంట పీఏసీఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్ విమర్శించారు. మంగళవారం రాజాపేట అతిథి గృహంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ చేపడుతున్న ఆందోళనలపై కాంగ్రెస్ శ్రేణులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాయి. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ మాట్లాడుతూ.. పదేళ్ల పాలనలో పేదలకు ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు, కనీసం కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఉచిత విద్యుత్ పేరిట వేల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేశారని, రైతులకు ఒకేసారి లక్ష రూపాయల రుణమాఫీ చేయకుండా ఇన్‌పుట్ సబ్సిడీ ఎగ్గొట్టిన అబద్ధాలకోరు పార్టీ బీఆర్ఎస్ అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక 'గృహజ్యోతి' ద్వారా ఉచిత విద్యుత్, సంక్షేమ ఫలాలు అందిస్తుంటే ఓర్వలేక దొంగ నాటకాలు ఆడుతున్నారని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి ఇంజ నరేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు సిల్వేరు బాలరాజు గౌడ్, మాడోత్ విఠల్ నాయక్, డిసిసి కార్యదర్శి పిట్టల జయరాములు, స్థానిక నాయకులు, సర్పంచులు, పీఏసీఎస్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

## భాజపా నాయకుల అరెస్టు

నాగం వర్షిత్‌రెడ్డి నివాసంపై దాడికి నిరసనగా చిట్యాలలో ధర్నా

ఆందోళన చేపట్టిన భాజపా నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

రాజకీయాల్లో దాడులకు తావులేదన్న భాజపా నేతలు

ఘటనను ఖండించాలని ప్రజాస్వామ్యవాదులకు పిలుపు



**తొలివెలుగు, చిట్యాల:** భాజపా జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నివాసంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారంటూ ఆరోపిస్తూ, దీనికి నిరసనగా చిట్యాలలో ధర్నా చేపట్టిన భాజపా నాయకులను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా భాజపా నాయకులు మాట్లాడుతూ.. వర్షిత్‌రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు భౌతిక దాడికి పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆరోపించారు. రాజకీయ విభేదాలను ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించుకోవాలి తప్ప భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని పేర్కొన్నారు. రాజకీయాల్లో ఇటువంటి ఘటనలకు తావు ఉండకూడదని, ప్రజాస్వామ్యవాదులంతా ఈ ఘటనను ఖండించాలని వారు కోరారు. నిరసన తెలిపే తమ హక్కును అడ్డుకోవడం సరికాదని పేర్కొంటూ, అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో భాజపా పట్టణ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, పూరెల్ల శ్రీనివాస్, చిక్కెన్‌మెట్ల అశోక్, గంజి గోవర్ధన్, కంచర్ల శంకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.





# ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి

- స్వాములవారి లింగోటంలో గ్రామసభ నిర్వహణ
- హర్ ఘర్ జల్, మౌలిక వసతులపై ప్రజలతో విస్తృత చర్చ
- గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి ప్రణాళిక రూపొందించేందుకు నిర్ణయం
- తెలంగాణ సర్పంచుల ఫోరమ్ వైస్ ప్రెసిడెంట్, గ్రామ సర్పంచ్ బీమిడి ప్రదీప్ జీ

**తొలివెలుగు, చౌటుప్పల్ :** ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో స్వాములవారి లింగోటం గ్రామపంచాయతీ పరిధిలో గ్రామసభ నిర్వహించారు. తెలంగాణ సర్పంచుల ఫోరమ్ వైస్ ప్రెసిడెంట్, గ్రామ సర్పంచ్ బీమిడి ప్రదీప్ జీ అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ సమావేశంలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, హర్ ఘర్ జల్ కార్యక్రమం అమలు, గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రజలతో విస్తృతంగా చర్చించారు. గ్రామంలో మౌలిక వసతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, ఉపాధి అవకాశాలు తదితర అంశాలపై గ్రామ ప్రజల అభిప్రాయాలు, సూచనలను స్వీకరించారు. గ్రామ అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు ప్రజల సూచనలను గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో పొందుపరచాలని నిర్ణయించారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో అమలవుతున్న హర్ ఘర్ జల్ కార్యక్రమం ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి తాగునీటి సౌకర్యం అందేలా అవసరమైన చర్యలు చేపట్టడంపై చర్చించారు.

ప్రజల అవసరాలు, సూచనలకు ప్రాధాన్యతనిస్తూ సమగ్ర గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికను రూపొందించాలని, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని గ్రామసభలో నిర్ణయించారు. సర్పంచ్ బీమిడి ప్రదీప్ జీ మాట్లాడుతూ.. "ప్రజల భాగస్వామ్యంతో రూపొందే ప్రణాళికే గ్రామ ప్రగతికి బలమైన పునాది.

గ్రామ ప్రజల సూచనలు, అవసరాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో చేపడతాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాతరాజు ధనంజయ్య, ఇరిగేషన్ ఏఈ నితీష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మచ్చగిరి, వార్డు సభ్యులు బాతరాజు పద్మ, ఉప్పు వీరేశం, పల్చం శంకర్, బాతరాజు లింగస్వామి, చెన్నెగోని సుశీల వెంకటేశం, తూర్పింటి సుజాత, చేగురి లింగస్వామి, రాధారపు సత్తయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు పిట్టల సాధానందం, గ్రామపంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- చౌటుప్పల్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, డీఎస్‌పీ ఆందోళన
- తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించిన నాయకులు
- పెండింగ్‌లో ఉన్న రూ.14 వేల కోట్ల బకాయిలు చెల్లించాలని డిమాండ్
- విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి





**తొలివెలుగు, చౌటుప్పల్:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.14 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్‌పీ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం చౌటుప్పల్ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. డీఎస్‌పీ జిల్లా కార్యదర్శి బీఆర్ సాయికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమం లో ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు ఎర్రోళ్ల శాంతికుమార్ మాట్లాడుతూ.. ఫీజు రీయిం బర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది విద్యార్థులపై బకాయిల ప్రభావం పడుతోందని, ఫీజులు చెల్లించలేక విద్యార్థులు, వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. బకాయిల విడుదలలో జాప్యం కారణంగా కొందరు విద్యార్థులు చదువును మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే పెండింగ్ నిధులను విడుదల చేసి, కళాశాలలకు ఫీజులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో నాయకులు జలంధర్, చెక్క కిరణ్ ముదిరాజ్, జోగు నర్సింగ్, యంజాల శ్రీకాంత్, చెక్క సాయికుమార్, భట్టు సాయి, బోయ కుమార్, జోగు స్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల డబుల్ ధమాకా



**న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలో సౌర విద్యుత్ వినియోగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించేందుకు ఢిల్లీ ప్రభుత్వం ఢిల్లీ సోలార్ పాలసీ 2023కి కీలక సవరణలను ఆమోదించింది. దీని ప్రకారం, 2025–26 ఆర్థిక సంవత్సరంలో నెలకు సగటున 400 యూనిట్ల వరకు విద్యుత్‌ను వినియోగించిన ఇళ్లకు 3 కిలోవాట్ల వరకు రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌లను ఎలాంటి ముందస్తు ఖర్చు లేకుండా ఉచితంగా ఏర్పాటు చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే రూ. 78,000 సబ్సిడీతో పాటు, ఢిల్లీ సర్కార్ అదనంగా మరో రూ. 78,000 సబ్సిడీని ఇస్తుంది. సోలార్ ప్లాంట్ టెండర్ వ్యయంలో మిగిలిన భారాన్ని కూడా ప్రభుత్వమే భరిస్తుండటంతో అర్హులైన వినియోగదారులకు రూపాయి ఖర్చు లేకుండా సోలార్ ఏర్పాటు కానుంది.

ఈ పథకం అమల్లోకి వచ్చినా ప్రస్తుతం వినియోగదారులు పొందుతున్న ఉచిత విద్యుత్ సబ్సిడీలు యథాతథంగా కొనసాగుతాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. నెలకు 200 యూనిట్ల వరకు ఉచితంగా పొందే కుటుంబాలు, తమ ఇంటిపై అమర్చే 3 కిలోవాట్ సోలార్ వ్యవస్థ ద్వారా ఉత్పత్తి అయ్యే సుమారు 300 యూనిట్ల విద్యుత్‌తో అదనపు లబ్ధి పొందుతాయి. తద్వారా సామాన్య పౌరులు కేవలం కరెంట్ వాడే వినియోగదారులుగానే కాకుండా, విద్యుత్‌ను స్వయంగా ఉత్పత్తి చేసే యజమానులుగా మారుతారని ప్రభుత్వం పేర్కొంది.

సోలార్ సిస్టమ్‌ల నిర్వహణను మరింత సులభతరం చేస్తూ, మొదటి ఐదేళ్ల పాటు ఉచిత రిపేర్లు, మెయింటెనెన్స్ సేవలను ప్రభుత్వమే అందించనుంది. అంతేకాకుండా, దాదాపు 25 సంవత్సరాల జీవితకాలం ఉండే ఈ సోలార్ ప్లాంట్ల ఏర్పాటు ప్రక్రియను సులభతరం చేసేందుకు నెట్ మీటరింగ్ వ్యవధిని 75 రోజుల నుండి 25 రోజులకు తగ్గించారు. దరఖాస్తు ఫీజులను కూడా మాఫీ చేస్తున్నట్టు ఢిల్లీ ప్రభుత్వం వెల్లడించింది.

## పిల్లల ఇష్టం ఒక్కటే కస్టడీని నిర్ణయించలేదు

### మధ్యప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు

**న్యూఢిల్లీ:** తల్లిదండ్రుల విడాకులు తీసుకుని విడిపోయిన వివాదాల్లో పిల్లల సంరక్షణ కేసులపై మధ్యప్రదేశ్ హైకోర్టు అత్యంత కీలక తీర్పును వెలువరించింది. కస్టడీ కేసుల్లో కేవలం చిన్నారుల కోరిక, ఇష్టాన్ని మాత్రమే ప్రాతిపదికగా తీసుకుని తుది నిర్ణయం తీసుకోలేమని ఉన్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. పిల్లల కస్టడీని నిర్ణయించడంలో వారి సమగ్ర సంక్షేమానికి మాత్రమే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ధర్మాసనం స్పష్టం చేసింది. కేవలం పిల్లలు ఎవరితో ఉంటామని చెబుతున్నారనే ఒక్క అంశంపైనే కస్టడీ హక్కులను ఖరారు చేయలేమని పేర్కొంది. పిల్లల మానసిక, శారీరక ఎదుగుదల, నాణ్యమైన విద్య, ఆర్థిక భద్రత, సురక్షితమైన వాతావరణాన్ని ఎవరు సమర్థవంతంగా అందించగలరో పరిశీలించడం కోర్టుల బాధ్యత అని వెల్లడించింది. పిల్లలు లేత వయస్సులో ఉన్నప్పుడు వారి మనస్సులు సున్నితంగా ఉంటాయని.. తల్లి, తండ్రిలో ఒకరు వారిని ప్రభావితం చేసే అవకాశం ఉంటుందని హైకోర్టు అభిప్రాయపడింది. ఓ వైపు ఉండే తల్లి, తండ్రి ప్రేరేపణ వల్ల పిల్లలు కోర్టు సమక్షంలో చెప్పే ఇష్టాయిష్టాలు మారవచ్చని, కాబట్టి న్యాయస్థానాలు కేవలం పిల్లల మాటలను మాత్రమే ప్రామాణికంగా తీసుకోకూడదని స్పష్టం చేసింది.

# రష్యా ఆర్మీలో 227 మంది భారతీయులు



**న్యూఢిల్లీ:** రష్యా సైన్యంలో 227 మంది భారతీయులు చేరినట్లు సమాచారం ఉందని, వారిలో 51 మంది ప్రాణాలు కోల్పోయారని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. మరో 139 మందిని రష్యా సైన్యం నుంచి ఇప్పటికే విడుదల చేసినట్లు విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. ఇంకా రష్యాలోనే ఉన్న భారతీయులను కూడా వీలైనంత త్వరగా విధుల నుంచి విడుదల చేసి స్వదేశానికి తీసుకురావడానికి మాస్కోతో నిరంతరం చర్చలు జరుపుతున్నామని చెప్పారు. ప్రధాని నరేంద్ర మోడీ కిర్గిస్థాన్ పర్యటన సందర్భంగా బిష్కెక్‌లో జరిగిన ప్రత్యేక మీడియా సమావేశంలో మిస్రీ ఈ వివరాలు వెల్లడించారు. ఈ అంశంపై భారత్, రష్యా మధ్య వివిధ స్థాయిల్లో పలుమార్లు చర్చలు జరిగాయని, మాస్కోలోని భారత రాయబార కార్యాలయం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని తెలిపారు. మిగిలిన భారతీయులను వారి కుటుంబాల వద్దకు చేర్చడమే ప్రభుత్వ ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా భారత్, రష్యా వాణిజ్యంపై మాట్లాడుతూ.. భారత్ నుంచి దిగుమతులను పెంచడంపై రష్యా దిగుమతిదారుల నుంచి సానుకూల అభిప్రాయం వ్యక్తమైంది. రానున్న రోజుల్లో రష్యాలో జరిగే సమావేశంలో భారతీయ ఎగుమతిదారుల ఫోరమ్ నిర్వహిస్తామని స్పష్టం చేశారు.

ఉక్రెయిన్‌లోని కీవ్, ఒడెసా, ఖేర్సన్ వంటి పలు కీలక నగరాలపై రష్యా బలగాలు జరిపిన బాలిస్టిక్ క్షిపణి, జెట్ డ్రోన్ దాడుల్లో మరణించిన 12 మందిలో ఒక భారతీయ పౌరుడు కూడా ఉన్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ మంగళవారం అధికారికంగా ధ్రువీకరించారు. కీవ్‌లోని రైల్వే డిపో, బోరిస్పిల్‌లోని నివాస ప్రాంగణాలు, ఒడెసా ఇంధన వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని జరిపిన ఈ దాడుల వల్ల పదుల సంఖ్యలో పౌరులు గాయపడటమే కాకుండా వేలాది ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన జెలెన్స్కీ, ప్రజా మౌలిక సదుపాయాలను ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేస్తున్న రష్యా ఉగ్రవాదాన్ని తిప్పికొట్టేందుకు పాశ్చాత్య దేశాలు వెంటనే శక్తివంతమైన ఎయిర్ డిఫెన్స్ ఆయుధ సామగ్రిని అందించాలని విజ్ఞప్తి చేశారు.

# థర్మల్ కేంద్రాలకు బొగ్గు కొరత రావొద్దు

### కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ:** దేశంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ బొగ్గు ఉత్పత్తి సంస్థలు తమతో ఒప్పందం ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గును సరఫరా చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన దేశవ్యాప్త ప్రభుత్వ బొగ్గు ఉత్పత్తి సంస్థల ఉన్నతాధికారులతో బొగ్గు సరఫరా పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దేశంలోని 28 థర్మల్ విద్యుత్ కేంద్రాల వద్ద బొగ్గు నిల్వలు తక్కువగా ఉన్నాయని తెలిపారు. ఆయా కేంద్రాలకు బొగ్గు సరఫరా చేసే ప్రభుత్వ సంస్థలు తక్షణమే స్పందించి, ఎటువంటి కొరత తలెత్తకుండా రవాణాను పెంచాలని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ కూడా తనతో ఇంధన సరఫరా ఒప్పందం ఉన్న థర్మల్ కేంద్రాలకు ఎప్పటిలాగే నిరంతరాయంగా బొగ్గును అందించాలని సూచించారు.



### విద్యుత్ అవసరాలకు అనుగుణంగా సరఫరా: సింగరేణి సీఎండీ

సింగరేణి సంస్థ చైర్మన్ & ఎండీ డా. బుద్ధప్రకాష్ జ్యోతి మాట్లాడుతూ.. ఒప్పందం ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు సంస్థ ఇప్పటికే తగినంత బొగ్గును సరఫరా చేస్తోందని, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని మునుముందు కూడా కొరత లేకుండా కృషి చేస్తామని మంత్రికి వివరించారు. ఈ సమీక్షా సమావేశంలో హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి డైరెక్టర్ గౌతమ్ పోట్రు, ఈడీ బి.వెంకన్న, జీఎం శ్రీనివాస్, కొత్తగూడెం నుంచి డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ, కె. వెంకటేశ్వర్లు, ఎం. తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేట్ ఉచిత వైద్య శిబిరాలను

# ఉపయోగించుకోవాలి

- ముక్తాపూర్‌లో నిమి హాస్పిటల్ ఆధ్వర్యంలో శిబిరం
- 200 మందికి పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ
- కౌన్సిలర్లు శ్రీరామ మంజుల, ఎల్లస్వామి



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి:** కార్పొరేట్ ఆసుపత్రులు అందించే ఉచిత వైద్య శిబిరాలను వార్డు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీరామ మంజుల లింగస్వామి యాదవ్, కొండమడుగు ఎల్ల స్వామి అన్నారు. హైదరాబాద్‌కు చెందిన నిమి హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం పురపాలక కేంద్రంలోని ముక్తాపూర్ 1, 2 వార్డుల పరిధిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్య బృందం వార్డులోని సుమారు 200 మంది ప్రజలకు బిపి, షుగర్ పరీక్షలతో పాటు సాధారణ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య బృందం, స్థానికులు పాల్గొన్నారు.

# కవ్వాల్ టైగర్ జోన్‌ను ఎత్తివేయాలి

### సామాజికవేత్త భూమాచారి దీక్షకు వుత్తూరి శ్రీనివాస్ మద్దతు

### 10వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష



**తొలివెలుగు, జన్నారం:** కవ్వాల్ టైగర్ జోన్‌ను తక్షణమే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ సామాజికవేత్త భూమాచారి చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారంతో పదో రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరుగుతున్న ఈ దీక్షా శిబిరాన్ని స్థానిక ప్రముఖ వ్యాపారవేత్త వుత్తూరి శ్రీనివాస్ సందర్శించి భూమాచారికి పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. టైగర్ జోన్ కారణంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. ప్రజల ప్రయోజనాలను కాపాడేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. భూమాచారి చేస్తున్న న్యాయబద్ధమైన పోరాటానికి ప్రజలు, ప్రజాసంఘాలు, స్థానిక నాయకులు ఏకమై పెద్దఎత్తున మద్దతు ఇవ్వాలని కోరారు.

## సైబర్ మోసాలపై జాగ్రత్త..

# ఒక్క నిర్లక్ష్యం భారీ నష్టం!

- ఆరెగూడెంలో సైబర్ క్రైమ్‌పై అవగాహన సదస్సు
- ఓటీపీ, పిన్, బ్యాంక్ వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దు: సీఐ మన్మథ కుమార్
- మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి



తొలివెలుగు, చౌటుప్పల్ : రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ సూచించారు. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మండలంలోని ఆరెగూడెం గ్రామంలో మంగళవారం సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్న మోసపూరిత విధానాలు, వాటి నుంచి రక్షించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు.

**రహస్య వివరాలు వెల్లడించొద్దు:**

గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, అనుమానాస్పద లింకుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సీఐ సూచించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ బ్యాంక్ ఖాతా వివరాలు, పిన్, ఓటీపీ, సీవీవీ, యూపీఐ పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు. కేవైసీ అప్‌డేట్, డిజిటల్ అరెస్ట్, ఆన్‌లైన్ లోన్లు, ఉద్యోగాలు, పెట్టుబడుల పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్‌ను నమ్మవద్దని తెలిపారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయకుండా జాగ్రత్త వహించాలని సూచించారు.

**మోసం జరిగితే ఆలస్యం చేయొద్దు:**

సైబర్ మోసానికి గురైన వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సీఐ మన్మథ కుమార్ సూచించారు. బాధితులు ఎంత త్వరగా ఫిర్యాదు చేస్తే అంత త్వరగా లావాదేవీలను అడ్డుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



## విద్యార్థి నిరసనకారులకు సుప్రీం భారీ ఊరట

- నీట్ పేపర్ లీకేజ్ వ్యతిరేక ఆందోళనల కేసుల్లో ఎఫ్ఐఆర్‌ల రద్దు
- నేరాల్లో ప్రత్యక్ష ప్రమేయం రుజువైతేనే కొత్త కేసులకు అవకాశం

**న్యూఢిల్లీ:** నీట్ ప్రశ్నపత్రం లీకేజ్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనల్లో పాల్గొన్న విద్యార్థి నిరసనకారులకు సుప్రీంకోర్టు భారీ ఊరటనిచ్చింది. జూలై 20 నుంచి 25 మధ్య దేశవ్యాప్తంగా జరిగిన ఆందోళనలకు సంబంధించి యువ నిరసనకారులపై నమోదైన అన్ని ఎఫ్ఐఆర్‌లను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు మంగళవారం తీర్పునిచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 కింద తనకున్న అసాధారణ అధికారాలను వినియోగించిన కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. అయితే నిరసనల సందర్భంగా శారీరక హాని లేదా ఆస్తి విధ్వంసం వంటి తీవ్రమైన నేరాల్లో ప్రమేయం ఉన్నట్టు దర్యాప్తులో రుజువైతే, ఆరోపణలు ఎదుర్కొంటున్న 2,873 మందిపై కొత్తగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసేందుకు అనుమతి ఇవ్వాలని ఢిల్లీ పోలీసులు కోరిన ప్రత్యేక పిటిషన్‌ను ప్రభుత్వం కోర్టు ముందుంచింది. ఈ అభ్యర్థన ఢిల్లీకి మాత్రమే పరిమితమని కేంద్రం స్పష్టం చేస్తూ, అటువంటి నేరాల్లో ప్రమేయం నిర్ధారణ అయితే ఆ 2,873 మందిపై మాత్రమే కొత్తగా కేసులు నమోదు చేసేందుకు అనుమతించాలని కోరింది. మరోవైపు నీట్ ప్రశ్నపత్రం లీకేజ్ కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన అభ్యర్థుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించేందుకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో సంప్రదించి అఖిల భారత స్థాయిలో ఒక సాధారణ యంత్రాంగాన్ని రూపొందించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు తీర్పుపై కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) హర్షం వ్యక్తం చేసింది. పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే తీర్పును 'సంపూర్ణ న్యాయం'గా అభివర్ణిస్తూ, ఇది విద్యార్థుల విజయమని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకేజ్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చిన సీజేపీ, విద్యార్థులపై నమోదైన అన్యాయమైన కేసులను కోర్టు కొట్టివేయడాన్ని స్వాగతించింది. తమ డిమాండ్లకు గుర్తింపు లభించిందని, ఇకపై ఏ విద్యార్థీ ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనే అవసరం ఉండదని పార్టీ పేర్కొంది. తమ డిమాండ్లు నెరవేరాయని, ఈ న్యాయం కోసం నెలరోజులు పోరాడాల్సి వచ్చిందని దీప్కే తెలిపారు.

## నేపాల్ వరదల్లో ధీరవనిత ప్రియా అధికారి

- 6,200 మీటర్ల ఎత్తులో హెలీక్యాప్టర్ నడిపి పర్వతారోహకుల రక్షణ
- రసువాలో వందలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించిన తొలి మహిళా కెప్టెన్





**నేపాల్:** నేపాల్‌లో వరదల బీభత్సంతో తీవ్రంగా దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతు న్నాయి. ముఖ్యంగా నేపాల్–టిబెట్ సరిహద్దులోని రసువా జిల్లాలో చిక్కుకున్న వందలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు నేపాల్ ఆర్మీ హెలీక్యాప్టర్లను రంగంలోకి దించింది. ఈ భారీ రెస్క్యూ మిషన్‌లో దాదాపు అందరూ పురుష పైలట్లే ఉండగా, ప్రియా అధికారి ఒక్కరే మహిళా కెప్టెన్‌గా సేవలందించారు. నేపాల్ తొలి మహిళా హెలీక్యాప్టర్ కెప్టెన్‌గా రికార్డు సృష్టించిన ప్రియా, వరదల తీవ్రత తమకూ సహాయక చర్యల్లో సవాళ్లు విసిరిందని తెలిపారు. వరద ఉధృతికి అతలాకుతలమైన రసువా జిల్లా తిమురే గ్రామంలో ఒకేసారి 20కి పైగా హెలీక్యాప్టర్లు ల్యాండ్ అయ్యేవని, పైలట్లు రేడియో ద్వారా నిరంతరం సమన్వయం చేసుకుంటూ బాధితులను తరలించారని చెప్పారు. ఈ భారీ ఆపరేషన్‌లో పైలట్లను సమన్వయం చేసుకుంటూ ప్రియా అలుపెరగకుండా సేవలందించారు. వరద బాధితులను మాత్రమే కాకుండా ఎవరెస్ట్ పర్వతంపై చిక్కుకున్న పర్వతారోహకులను సైతం ఆమె రక్షించారు. ఇందుకోసం ఏకంగా 6,200 మీటర్ల ఎత్తులో హెలీక్యాప్టర్‌ను నడిపారు. తాజా రెస్క్యూ మిషన్ గురించి ప్రియా మాట్లాడుతూ, తిమురేలో వరదల కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోగా, వందలాది మంది చిక్కుకుపోయారని, తాము 200 మందికి పైగా బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించామని తెలిపారు. వరదల్లో ఐదు జలవిద్యుత్ ప్రాజెక్టులు కొట్టుకుపోయాయని, భారీ ప్రాణనష్టం సంభవించిందని చెప్పారు. హెలీక్యాప్టర్ నిలిపిన ప్రతిచోటా బాధితులు కనిపించినప్పుడు వారిని కాపాడగలననే సంతోషం కలిగేదని, 'మీరు బతికిపోయారు' అంటూ వారిలో ధైర్యం నింపేదానినని తెలిపారు. వారితో తనకు ఎలాంటి బంధుత్వం లేకపోయినా, రెస్క్యూ సమయంలో బాధితులను తరలిస్తుండగా ఎంతో భావోద్వేగానికి గురయ్యానని వెల్లడించారు. కాగా, ప్రియా అనుకోకుండా హెలీక్యాప్టర్ పైలట్ వృత్తిలోకి అడుగుపెట్టారు. బీఎస్సీ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ చదివిన ఆమె ఒకసారి హెలీక్యాప్టర్‌లో ప్రయాణించారు. ఆ అనుభవంతో పైలట్ కావాలనే కోరిక బలంగా ఏర్పడింది. 'నేను హెలీక్యాప్టర్ పైలట్ అయితే ఎలా ఉంటుంది?' అని అప్పటి కెప్టెన్‌ను అడిగిన ఆమె, నాలుగు నెలల్లోనే ఫిలిప్పీన్స్‌కు వెళ్లి పైలట్ శిక్షణ పొందారు. తొలుత క్యాబిన్ క్రూగా పనిచేసిన ఆమెకు హెలీక్యాప్టర్ పైలటింగ్‌పై ఆసక్తి పెరిగింది. కెప్టెన్ హోదాకు అవసర మైనన్ని గంటలు హెలీక్యాప్టర్ నడిపిన అనంతరం 2017లో పూర్తిస్థాయి పైలట్‌గా కెరీర్‌ను ప్రారంభిం చారు. గతంలోనూ ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యల్లో పాల్గొన్న ప్రియకు తాజా వరదలు మరింత కఠినమైన పరీక్షగా నిలిచాయి. అయితే ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లోనూ రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించేలా తమకు శిక్షణ ఇచ్చారని ఆమె గర్వంగా చెబుతున్నారు. భవిష్యత్‌లో మరింత మంది మహిళలు హెలీక్యాప్టర్ కెప్టెన్లుగా ఎదగాలని కోరుకుంటున్న ప్రియా, తన తల్లి కోరిక మేరకు ఎంబీఏను కూడా పూర్తి చేశారు.

## ఏటీఎఫ్, వాణిజ్య గ్యాస్ ధరలు పెంపు

**న్యూఢిల్లీ:** దేశీయ విమానయాన సంస్థలు వినియోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ (ఏటీఎఫ్), హోటళ్లు, రెస్టారెంట్లలో ఉపయోగించే వాణిజ్య ఎల్‌పీజీ, వాహనాల ఇంధనమైన సీఎన్‌జీ, గృహాలు, పరిశ్రమలకు పైపులైన్ల ద్వారా సరఫరా చేసే పీఎన్‌జీ ధరలు మంగళవారం నుంచి పెరిగాయి. ఏటీఎఫ్ ధర లీటర్‌కు రూ.6.28 (5.46 శాతం) పెరిగి రూ.121.28కి చేరింది. ఆగస్టు 1న లీటర్‌కు రూ.5 పెంచిన తర్వాత మరోసారి ధర పెంచారు. విమాన యాన సంస్థల నిర్వహణ వ్యయంలో ఏటీఎఫ్ వాటా దాదాపు 40 శాతం వరకు ఉండటంతో తాజా పెంపు వాటిపై అదనపు భారాన్ని మోపనుంది. వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల ధరలు కూడా పెరిగాయి. 19 కిలోల సిలిండర్ ధర రూ.9.50 పెరిగి రూ.2,747.50కి చేరగా, 5 కిలోల ఫ్రీ ట్రేడ్ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.2 పెరిగి రూ.764కు చేరుకుంది. పశ్చిమాసియా సంక్షోభ సమయంలో భారీగా పెరిగిన వాణిజ్య ఎల్‌పీజీ ధరలు తాజాగా మరోసారి పెరిగాయి. ఫిబ్రవరి నుంచి జూన్ మధ్య 19 కిలోల సిలిండర్ ధర రూ.1,740.50 నుంచి రూ.3,113.50కి పెరిగి రూ.1,373 మేర భారమైంది. ప్రధాన నగరాల్లోనూ ధరలు పెరిగాయి. ముంబైలో 19 కిలోల సిలిండర్ ధర రూ.9.50 పెరిగి రూ.2,701కు, కోల్‌కతాలో రూ.11.50 పెరిగి రూ.2,884కు, చెన్నైలో రూ.10.50 పెరిగి రూ.2,916.50కు చేరింది. అయితే 14.2 కిలోల గృహ వినియోగ ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.942 వద్ద యథాతథంగా కొనసాగుతోంది. దీని ధరను చివరిసారిగా జూన్ 7న రూ.29 పెంచారు. ఇదిలా ఉండగా మహానగర్ గ్యాస్ లిమిటెడ్ సీఎన్‌జీ ధరను కిలోకు రూ.2, దేశీయ పీఎన్‌జీ ధరను స్టాండర్డ్ క్యూబిక్ మీటర్‌కు రూ.1 చొప్పున పెంచింది. దీంతో ముంబై, పరిసర ప్రాంతాల్లో సీఎన్‌జీ ధర కిలోకు రూ.88కు చేరింది. పీఎన్‌జీ ధరల పెంపు వినియోగదారులపై ప్రభావం చూపనుంది.



## మోదీని తొలగించి గ్రూప్ ఫొటో

- పాక్ ప్రధాని కార్యాలయంపై విమర్శలు
- ఎస్‌సీవో సదస్సు గ్రూప్ ఫొటోను క్రాప్ చేసి పోస్ట్ చేసిన పాక్
- సోషల్ మీడియాలో తీవ్ర స్పందన

**కిర్గిస్తాన్:** కిర్గిస్తాన్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సులో చోటుచేసుకున్న ఓ ఘటనపై పాకిస్తాన్ ప్రధాని కార్యాలయంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పాటు పలు దేశాల అధినేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం నేతలంతా కలిసి గ్రూప్ ఫొటో దిగారు. ఆయా దేశాల ప్రభుత్వాలు ఈ ఫొటోలను తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకున్నాయి. అయితే పాకిస్తాన్ ప్రధాని కార్యాలయం మాత్రం అసలు గ్రూప్ ఫొటోను క్రాప్ చేసి, అందులో భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు మరికొందరు నేతలు కనిపించకుండా ఉన్న చిత్రాన్ని సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. పాక్ పోస్ట్ చేసిన చిత్రంలో పుతిన్, జిన్‌పింగ్, షెహబాజ్ షరీఫ్ తదితర నేతలు కనిపించగా, మోదీ ఉన్న భాగాన్ని తొలగించినట్లు స్పష్టమవుతోంది. భారత్, పాకిస్తాన్ మధ్య రాజకీయ విభేదాలు కొనసాగుతున్నప్పటికీ, అంతర్జాతీయ వేదికలపై దేశాధినేతలు పరస్పరం గౌరవప్రదంగా వ్యవహరించడం సాధారణం. ఈ నేపథ్యంలో పాక్ ప్రధాని కార్యాలయం అధికారికంగా గ్రూప్ ఫొటోను మార్చి ప్రచురించడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ప్రధాని నరేంద్ర మోదీ తన సోషల్ మీడియా ఖాతాలో పూర్తి గ్రూప్ ఫొటోను పంచుకు న్నారు. అందులో పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సహా ఇతర దేశాల నేతలు కూడా ఉన్నారు. ఈ రెండు చిత్రాలను పోలుస్తూ సోషల్ మీడియాలో నెటిజన్లు స్పందిస్తున్నారు. పాకిస్తాన్ ప్రధాని కార్యాలయం పోస్ట్‌పై పలువురు భారతీయులు విమర్శలు, మీమ్స్‌తో స్పందించగా, ఈ వ్యవహారం ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

## బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండండి

### అవసరం లేకపోతే బంగారం కొనొద్దు

**న్యూఢిల్లీ:** బంగారం కొనుగోళ్ల విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు మరోసారి కీలక విజ్ఞప్తి చేశారు. అవసరం లేకపోతే బంగారం కొనుగోలు చేయవద్దని సోషల్ మీడియాలో విడుదల చేసిన వీడియోలో పిలుపునిచ్చారు. మే 11న కూడా మోదీ ఇదే తరహాలో ప్రజలకు సూచన చేశారు. ప్రజల సంకల్ప బలం, కఠోర శ్రమను ప్రశంసించిన ఆయన.. ఇది దేశ సామూహిక శక్తికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచం ప్రస్తుతం యుద్ధాలతో చుట్టుముట్టి ఉన్న పరిస్థితుల్లో దేశ ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని సూచించారు. కొందరు వ్యక్తు లు అబద్ధాలను ప్రచారం చేస్తూ ప్రజల్లో నిరాశను వ్యాప్తి చేయడానికి, దేశ వాతావరణాన్ని దెబ్బతీయ డానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సెలవుల కోసం విదేశాలకు వెళ్లడం, విదేశాల్లో వివాహాలు చేసుకోవడం వంటి వాటికి ప్రజలు దూరంగా ఉం డాలని సూచించిన మోదీ.. 'మేక్ ఇన్ ఇండియా' మంత్రంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అవసరం లేనప్పుడు బంగారం కొనుగోలు చేయ కుండా దేశ ఆర్థిక ప్రయోజనాలకు తోడ్పడాలని కోరారు. ఇదిలా ఉండగా ఉగ్రవాదం ఏ దేశానికీ వ్యూహాత్మక ఆస్తిగా ఉండలేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగిన షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీవో) 26వ శిఖరాగ్ర సమావేశంలో మంగళవారం ఆయన ఉగ్రవాదంపై సభ్య దేశాలకు బలమైన సందేశం ఇచ్చారు. మొత్తం ఉగ్రవాద వ్యవస్థను నిర్మూలిం చాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో ద్వంద్వ ప్రమాణాలకు ఎలాంటి తావు లేదని స్పష్టం చేశారు.



## నేపాల్ వరదల్లో ఘోర విషాదం

- ఒకే ఇంట్లో 24 మృతదేహాలు
- నువాకోట్ జిల్లాలో వెలుగుచూసిన దారుణం
- ఇంకా కొనసాగుతున్న గాలింపు, ఇల్లు హోటలా? గెస్ట్‌హౌజా?

**కాట్మాండు:** నేపాల్‌ను అతలాకుతలం చేసిన బురద వరదల్లో తీవ్ర విషాద ఘటన వెలుగుచూసింది. నువాకోట్ జిల్లాలోని బిదుర్ మున్సిపాలిటీ పరిధిలో బేత్రావతి వద్ద వరదలకు దెబ్బతిన్న ఓ ఇంటి శిథిలాలను పరిశీలిస్తుండగా ఏకంగా 24 మంది మృతదేహాలను అధికారులు గుర్తించారు. శక్తివంతమైన బురద ప్రవాహానికి అనేక ఇళ్లు ధ్వంసం కావడంతో వాటి శిథిలాల్లో చిక్కుకున్న వారిని రక్షించేందుకు నేపాల్ ఆర్మీ హెలీక్యాప్టర్ల సాయంతో గాలింపు, సహాయక చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో వరద ప్రభావిత ప్రాంతంలోని ఓ ఇంటిని పరిశీలిస్తుండగా భారీ సంఖ్యలో మృతదేహాలు బయటపడినట్లు నువాకోట్ జిల్లా ఎస్పీ బిపిన్ రెజ్మీ ధ్రువీకరించారు. ప్రస్తుతం ఆ ఇంట్లో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని, మృతదేహాల తుది సంఖ్యను అనంతరం వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. అయితే ఇల్లు ఎవరికి చెందినదన్న విషయం ఇంకా తెలియరాలేదు. స్థానిక అధికారుల నుంచి పూర్తి సమాచారం సేకరిస్తున్నారు. ఆ భవనం హోటల్ లేదా గెస్ట్‌హౌస్ అయి ఉండొచ్చని అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నప్పటికీ, దీనిపై ఇంకా అధికారిక నిర్ధారణ లేదు. ఒకే ఇంట్లో ఇంతమంది ఎలా ఉన్నారనే విషయంపై కూడా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఆగస్టు 26న సంభవించిన భారీ వరదలు, బురద ప్రవాహాల కారణంగా నేపాల్‌లో ఇప్పటికే వెయ్యికి పైగా మరణాలు నమోదైనట్లు సమాచారం. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు.. 12 మంది మృతి

- కీవ్, ఒడెశాపై డ్రోన్లు, మిస్సైళ్లతో విరుచుకుపడిన రష్యా
- మృతుల్లో భారతీయుడు ఉన్నట్లు సమాచారం



**కీవ్:** రష్యా–ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతున్న వేళ రష్యా మరోసారి ఉక్రెయిన్‌పై భారీ దాడులకు పాల్పడింది. రాజధాని కీవ్‌తో పాటు ఒడెశా ప్రాంతంపై డ్రోన్లు, వివిధ రకాల మిస్సైళ్లతో విరుచుకుపడింది. ఈ దాడుల్లో 12 మంది మృతి చెందినట్లు సమాచారం. మృతుల్లో ఓ భారతీయుడు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అతడికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. ఉక్రెయిన్ వెల్లడించిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు దేశంలోని 28 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని రష్యా దాడులు చేసింది. దాదాపు 200 డ్రోన్లు, మిస్సైళ్లతో దాడులు నిర్వహించింది. కీవ్, ఒడెశా ప్రాంతాలపై బాలిస్టిక్, క్రూయిజ్, యాంటీ రాడార్ మిస్సైళ్లను ప్రయోగించింది. జనావాస ప్రాంతాలను కూడా ఈ దాడులు తాకడంతో ఇళ్లు, అపార్ట్‌మెంట్లు భారీగా ధ్వంసమయ్యాయి. దాడుల్లో పలువురు గాయపడగా, క్షతగాత్రుల్లో చిన్నారులు కూడా ఉన్నారు. ధ్వంసమైన నివాసాల నుంచి ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. భారీ సంఖ్యలో సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. దాడుల ప్రభావంతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరోవైపు యుద్ధంతో తీవ్రంగా నష్టపోతున్న ఉక్రెయిన్‌కు మరింత సాయం అందించేందుకు యూరోపియన్ యూనియన్ సిద్ధమవుతోంది. ఆర్థిక సహాయంతో పాటు ఉక్రెయిన్‌కు 104 బిలియన్ డాలర్ల రుణాన్ని అందించే ప్రయత్నాలు కూడా కొనసాగుతున్నాయి.

## ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీకి భారీ ఊరట

- కుటుంబ సభ్యులతో భేటీకి అనుమతి
- పిల్లలతో ఫోన్‌లో మాట్లాడే అవకాశం కల్పించాలని హైకోర్టు ఆదేశం

**ఇస్లామాబాద్:** జైలులో శిక్ష అనుభవిస్తున్న పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్, ఆయన భార్య బుష్రా బీబీలకు ఇస్లామాబాద్ హైకోర్టు భారీ ఊరటనిచ్చింది. వారిని ఇతర ఖైదీలకు, కుటుంబ సభ్యులకు దూరంగా ఒంటరిగా ఉంచకూడదని అడియాలా జైలు అధికారులను ఆదేశించింది. జైలు నిబంధనల ప్రకారం ఇమ్రాన్ ఖాన్, బుష్రా బీబీలను వారి బంధువులు కలిసేందుకు అనుమతించాలని, లండన్‌లో ఉంటున్న వారి కుమారులతో ఫోన్‌లో మాట్లాడే అవకాశం కల్పించాలని స్పష్టం చేసింది. అలాగే వారికి న్యూస్ పేపర్లు, పుస్తకాలు అందించడంతో పాటు అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించాలని ఆదేశించింది. రావల్పిండిలోని అడియాలా జైలులో ఇమ్రాన్ ఖాన్ 2023 నుంచి, బుష్రా బీబీ 2024 జనవరి నుంచి శిక్ష అనుభవిస్తున్నారు. అయితే వీరిని కుటుంబ సభ్యులు కలిసేందుకు ప్రభుత్వం, జైలు అధికారులు అనుమతించడం లేదంటూ వారి తరఫున ఇస్లామాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను జైలు అధికారులు అమలు చేయడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి ఖాదిమ్ హుస్సేన్ సూమ్రో తాజాగా పలు ఆదేశాలు జారీ చేశారు. కోర్టు ఆదేశాలను అడియాలా జైలు సూపరింటెండెంట్ అమలు చేయాలని, తీసుకున్న చర్యలపై 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా, ఇమ్రాన్ ఖాన్‌కు మెరుగైన వైద్య సహాయం అందించాలని గత ఆగస్టులోనూ కోర్టు ఆదేశించింది. ఆ ఆదేశాల మేరకు ఆయనను ఆస్పత్రికి తరలించినప్పటికీ, చికిత్స అనంతరం వెంటనే తిరిగి జైలుకు తీసుకెళ్లారు. దీంతో కోర్టు ఆదేశాలను ప్రభుత్వం సరిగా అమలు చేయడం లేదని ఆరోపిస్తూ ఇమ్రాన్ ఖాన్ సోదరి పాకిస్థాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే ఆ పిటిషన్‌ను అంత త్వరగా విచారించడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు తెలిపింది.

## కెనడా వీసాకు పెరిగిన జీవన వ్యయ నిధులు

### ఏడాది ఖర్చుల కోసం రూ.16 లక్షలు చూపించాల్సిందే

**ఒట్టావా:** కెనడాలో చదువుకోవాలనుకునే విదేశీ విద్యార్థులకు వీసా నిబంధనలు మరింత కఠినతరం అయ్యాయి. విద్యార్థుల జీవన వ్యయానికి సంబంధించిన ఆర్థిక నిధులను కెనడా ప్రభుత్వం పెంచింది. ఈ కొత్త నిబంధన సెప్టెంబరు 1 నుంచి అమల్లోకి వచ్చింది. కెనడా వలస, శరణార్థులు, పౌరసత్వ సంస్థ (ఐఆర్‌సీసీ) వెల్లడించిన వివరాల ప్రకారం.. కెనడాలో చదువుకునే విద్యార్థులు ఒక ఏడాదికి సంబంధించిన జీవన వ్యయాలను భరించగలమని నిరూపించేందుకు తమ వద్ద రూ.16 లక్షలు (23,448 కెనడా డాలర్లు) ఉన్నట్లు చూపించాలి. అలాగే ఇద్దరు కుటుంబ సభ్యులతో కలిసి కెనడాలో నివసిస్తూ చదువుకోవాలనుకునే విద్యార్థులు రూ.19 లక్షల మేర నిధులు కలిగి ఉండాల్సి ఉంటుంది. ఈ ఆర్థిక నిబంధనలను పాటించినప్పుడే వీసా దరఖాస్తు ప్రక్రియలో ముందుకు వెళ్లే అవకాశం ఉంటుంది.

## టైమ్స్ స్క్వేర్ వద్ద కత్తులతో మహిళ దాడి.. ఒకరి మృతి

### ఇద్దరిపై విచక్షణారహితంగా దాడి

**న్యూయార్క్:** అమెరికాలోని న్యూయార్క్ నగరంలో పర్యాటకులతో రద్దీగా ఉండే టైమ్స్ స్క్వేర్ సమీపంలో కత్తులతో దాడి ఘటన కలకలం రేపింది. వెస్ట్ 42వ స్ట్రీట్, సెవెన్త్ అవెన్యూ ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఓ మహిళ ఇద్దరిపై కత్తులతో దాడి చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షాపింగ్ బ్యాగ్ నుంచి రెండు పొడవైన కిచెన్ కత్తులను బయటకు తీసిన మహిళ, 68 ఏళ్ల వ్యక్తితో పాటు 32 ఏళ్ల మహిళపై దాడి చేసి కడుపులో పొడిచింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ 68 ఏళ్ల వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. మరో మహిళకు చికిత్స కొనసాగుతోంది. దాడికి పాల్పడిన మహిళ మానసి కంగా అస్వస్థతకు గురై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఆమె పై కాల్పులు జరపగా మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది.

## హోర్ముజ్ వద్ద ఇరాన్ రాకెట్ లాంచర్లపై అమెరికా దాడులు

- ఆరు నెలల యుద్ధంలో మళ్లీ ఉద్రిక్తత
- ప్రతీకారం తీర్చుకుంటామన్న ఇరాన్.
- ఇరాన్ అంతమైపోయింది' అన్న ట్రంప్



**వాషింగ్టన్:** ఆరు నెలలకు పైగా కొనసాగుతున్న అమెరికా–ఇరాన్ యుద్ధంలో నెల రోజులుగా నెలకొన్న తాత్కాలిక విశ్రాంతికి తెరపడింది. ఆదివారం హోర్ముజ్ జలసంధి వద్ద ఇరాన్ రాకెట్ లాంచర్లపై అమెరికా దళాలు దాడులు నిర్వహించాయి. ఈ చర్యను ఇరాన్ ప్రాణాంతక దాడిగా అభివర్ణిస్తూ తక్షణమే ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ దళాలు హోర్ముజ్ జలసంధిలోకి సముద్ర మైన్లతో కూడిన రాకెట్లను ప్రయోగించేందుకు సిద్ధమవుతున్నట్లు గుర్తించామని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రతినిధి టిమ్ హాకిన్స్ తెలిపారు. గతవారం హోర్ముజ్ జలసంధిలోని అంతర్జాతీయ నౌకా రవాణా మార్గాల నుంచి సముద్ర మైన్లను తొలగించే ప్రక్రియను అమెరికా సైన్యం పూర్తి చేసింది. ఇదిలా ఉండగా జలసంధిలోని లారాక్ ద్వీపం సమీపంలో పేలుడు శబ్దాలు వినిపించినట్లు ఇరాన్‌కు చెందిన పాక్షిక అధికారిక వార్తా సంస్థలు వెల్లడించాయి. అమెరికా దాడుల్లో తమ పోరాట యోధులు, పౌరుల్లో కొందరు మృతి చెందగా, మరికొందరు గాయపడినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ పేర్కొంది. అనంతరం అమెరికా దాడులకు ప్రతిస్పందనగా జోర్డాన్‌లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్లు ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ ప్రకటించింది. ఆ దృశ్యాలను కూడా ప్రసారం చేసింది. మరోవైపు తీరప్రాంత నిఘా, రక్షణ స్థావరాలతో పాటు డజన్ల కొద్దీ రివల్యూషనరీ గార్డ్ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారీ దాడుల పరంపరను అమెరికా ప్రకటించింది. గల్ఫ్ మిత్రదేశాలైన ఖతార్, సౌదీ అరేబియా, యూఏఈ అభ్యర్థన మేరకు కొత్త దాడులను నిలిపివేయాలని ఆగస్టు 1న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సైన్యాన్ని ఆదేశించనున్నట్లు ప్రకటించారు. అయితే తాజా దాడులతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తత మళ్లీ తీవ్రస్థాయికి చేరింది. ఇదిలా ఉండగా పరస్పర దాడుల నేపథ్యంలో ఇరాన్‌ను ట్రంప్ తీవ్రంగా విమర్శించారు. తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో 'అది అంతమైపోయింది' అంటూ ఇరాన్‌పై వ్యాఖ్యానించారు.

## పాకిస్థాన్‌లో 125 ఏళ్ల నాటి హిందూ ఆలయం ధ్వంసం

- మదర్సా నిర్మాణం కోసమే కూల్చివేశారన్న ఆరోపణలు
- ఆలయాన్ని పునర్నిర్మించాలని మైనార్టీ సంఘాల డిమాండ్

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లోని తూర్పు పంజాబ్ ప్రావిన్సులో సుమారు 125 ఏళ్ల చరిత్ర కలిగిన హిందూ ఆలయం ధ్వంసమైన ఘటనపై వివాదం నెలకొంది. గత నెల ఆగస్టు 21న నరోవాల్ జిల్లాలోని సిరాజ్ గ్రామంలో ఈ ఘటన జరిగినట్లు నివేదికలు వెల్లడించాయి. లాహోర్‌కు సుమారు 130 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయం దాదాపు వెయ్యి చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉండేది. సమీపంలో మదర్సా నిర్మాణం కోసం ఆలయాన్ని కూల్చివేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిషేధిత తెహ్రీక్–ఇ–లబ్బాయిక్ పాకిస్థాన్ (టీఎల్‌పీ) గ్రూపు ఈ ఆలయాన్ని ధ్వంసం చేసినట్లు ఆరోపణలు ఉన్నప్పటికీ, ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ లేదు. మరోవైపు ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగానే శతాబ్దం నాటి ఆలయం కూలిపోయిందని పాకిస్థాన్ ప్రభుత్వం చెబుతోంది. ఈ నేపథ్యంలో ఆలయాన్ని తిరిగి నిర్మించాలని స్థానిక ప్రజలు, మైనార్టీ సంఘాలు, రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి. ఆలయం చుట్టుపక్కల జరిగిన ఆక్రమణలను తొలగించి, ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రధాని షెహబాజ్ షరీఫ్‌ను కోరుతున్నారు. ఇదిలా ఉండగా హిందూ ఆలయాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పాకిస్థాన్ మసీహ్ మిల్లత్ పార్టీ పంజాబ్ ముఖ్యమంత్రి మరియం నవాజ్ షరీఫ్‌ను డిమాండ్ చేసింది. ఆలయ ధ్వంసానికి అసలు కారణమేంటన్న దానిపై స్పష్టత రావాల్సి ఉండటంతో ఈ ఘటన పాకిస్థాన్‌లో చర్చనీయాంశంగా మారింది.

# మెరిసిన వైభవ్, ఇషాన్

## దులీప్ ట్రోఫీ ఫైనల్‌కు ఈస్ట్ జోన్



**బెంగళూరు:** ఈస్ట్ జోన్ దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెంట్రల్ జోన్‌తో జరిగిన తొలి సెమీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించింది. 159 పరుగుల టార్గెట్‌ని ఈస్ట్.. 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ (40; 43 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), కెప్టెన్ ఇషాన్ కిషన్ (39; 41 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) మెరిశారు. అభిమన్యు ఈశ్వరన్ (24), కుమార్ కుశాగ్ర (22) రన్స్ చేశారు. షమి (8*) విన్నింగ్ షాట్ (ఫోర్) కొట్టాడు. అంతకుముందు రెండో ఇన్నింగ్స్‌లో 45/3 స్కోరుతో మంగళవారం ఆటను కొనసాగించిన సెంట్రల్.. 158 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ అమన్ మోఖడే (41) రాణించగా..అర్షద్ ఖాన్ (25), హర్ష్ దూబె (24), రింకు సింగ్ (20) పరుగులు చేశారు. ముకేశ్ కుమార్ (4/44), మహ్మద్ షమి (3/56) సత్తాచాటారు. అభిజిత్, అనుకుల్ రాయ్, కౌనైన్ ఖురేషీ ఒక్కో వికెట్ పడగొట్టారు. తొలి ఇన్నింగ్స్‌లో ఇరుజట్లూ 266 పరుగులకు ఆలౌటైన సంగతి తెలిసిందే. సెప్టెంబరు 6 నుంచి చెపాక్ స్టేడియంలో ఫైనల్ మ్యాచ్ మొదలుకానుంది. నార్త్ జోన్, సౌత్ జోన్ మధ్య జరుగుతున్న రెండో సెమీ ఫైనల్‌లో విజేతగా నిలిచిన జట్టుతో ఈస్ట్ జోన్ తుదిపోరులో తలపడుతుంది.

# అఫ్గాన్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు



**ముంబై:** అఫ్గానిస్థాన్‌తోఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్న టీ20 సిరీస్‌కు సంబంధించి భారత జట్టును బీసీసీఐసెలక్షన్ కమిటీ ప్రకటించింది. భారత స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చాడు. గాయంతో చాన్నాళ్లుగా జట్టుకు దూరమైన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యను జట్టులోకి తీసుకోలేదు. అతడి కాలికి మరోసారి గాయం కావడంతోనే జట్టులోకి తీసుకోలేదని సమాచారం. శ్రేయస్ అయ్యర్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. తెలుగు కుర్రాడు తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. జింబాబ్వే పర్యటనలో రాణించిన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు.

జింబాబ్వే సిరీస్‌కు దూరమైన సంజూ శాంసన్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్‌సింగ్, హర్షిత్ రాణా తిరిగి జట్టులోకి వచ్చారు. బుమ్రా, నితీశ్, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా సెలక్ట్ అయినప్పటికీ వారికి ఫిట్‌నెస్ క్లియరెన్స్ రావాల్సి ఉంది. గత జింబాబ్వే సిరీస్‌లో ఆడిన ఎనిమిది మంది ప్లేయర్లు.. సూర్యాంశ్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబె, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఈ సిరీస్‌కు ఎంపిక కాలేదు. దిల్లీ వేదికగా అఫ్గాన్‌తో భారత్ మూడు టీ20లు ఆడనుంది. సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి.

**భారత జట్టు:** శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, శివమ్ దూబె, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా

## ఒంటిచేత్తో గ్లెన్ ఫిలిప్స్ స్టన్నింగ్ క్యాచ్



**గయానా:** న్యూజిలాండ్ ఆటగాడు గ్లెన్ ఫిలిప్స్ తరచూ కళ్లు చెదిరే క్యాచ్‌లు పడుతూ ఔరా అనిపిస్తున్నాడు. తాజాగా కరేబియన్ ప్రియయర్ లీగ్ లోనూ తన ఫీల్డింగ్ విన్యాసంతో ఆకట్టుకున్నాడు. గయానా అమెజాన్ వారియర్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఫిలిప్స్.. సోమవారం రాత్రి ట్రిన్‌బాగో నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బౌండరీ లైన్ వద్ద ఒంటిచేత్తో సూపర్ క్యాచ్ అందుకున్నాడు. ప్రిటోరియస్ బౌలింగ్‌లో బ్యాటర్ సునీల్ నరైన్ భారీ షాట్ ఆడాడు. డీప్ మిడ్ వికెట్ బౌండరీ లైన్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న గ్లెన్ ఫిలిప్స్.. మెరుపు వేగంతో దూసుకొచ్చి సిక్సర్‌గా వెళ్లే ఆ బంతికి చేయి అడ్డుపెట్టాడు. ఈ క్రమంలో అద్భుత రీతిలో క్యాచ్ పట్టాడు. ఆ తర్వాత తానే ఈ క్యాచ్ పట్టాన అన్నట్లు ఆశ్చర్యానికి గురయ్యాడు.

# ఆ ఇద్దరి విభేదాలతోనే పాక్ క్రికెట్ పతనం

## బాబర్, షాహీన్ మధ్య కెప్టెన్సీ వివాదమే నాంది: బాసిత్ అలీ

## '70 ఏళ్లలో ఇదే అత్యంత చెత్త క్రికెట్ బోర్డు': రషీద్ లతీఫ్



**లాహోర్:** ఇంగ్లాండ్‌తో జరుగుతున్న మూడు టెస్టుల సిరీస్‌లో పాకిస్థాన్ జట్టు పేలవ ప్రదర్శనపై ఆ దేశ మాజీ క్రికెటర్లు తీవ్రంగా మండిపడుతున్నారు. తొలి రెండు టెస్టుల్లో ఓటమిపాలైన పాక్.. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో ఒక్కసారి కూడా 200 పరుగుల మార్కును దాటలేకపోయింది. జట్టు ఆటతీరుతో పాటు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వ్యవహారశైలిపైనా మాజీలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు.

పీసీబీనే జట్టు ప్రస్తుత దుస్థితికి ప్రధాన కారణమని మాజీ వికెట్ కీపర్ రషీద్ లతీఫ్ ఆరోపించాడు. ''అందరూ పాకిస్థాన్ జట్టు గురించే మాట్లాడుతు న్నారు. కానీ జట్టు ఎంపిక చేసే సెలక్షన్ కమిటీని, కోచ్‌లను నియమించేది బోర్డే. కాబట్టి జట్టు వైఫల్యానికి పీసీబీ బాధ్యత వహించాలి. గత 70 ఏళ్లలో ఇంత దారుణమైన బోర్డు ఎప్పుడూ లేదని నేను భావిస్తున్నా'' అని లతీఫ్ తీవ్రంగా విమర్శించాడు.

### బాబర్–షాహీన్ మధ్య విభేదాలే కారణం

పాకిస్థాన్ క్రికెట్ పతనానికి మాజీ కెప్టెన్ బాబర్ అజామ్, స్టార్ పేసర్ షాహీన్ షా అఫ్రిది మధ్య ఏర్పడిన విభేదాలే ప్రధాన కారణమని మాజీ బ్యాటర్ బాసిత్ అలీ అభిప్రాయపడ్డాడు. ముఖ్యంగా కెప్టెన్సీ విషయంలో ఇద్దరి మధ్య తలెత్తిన వివాదం తర్వాతే జాతీయ జట్టు పరిస్థితి క్రమంగా దిగజారిందని పేర్కొన్నాడు. ''బాబర్ అజామ్ బలమైన కెప్టెన్ కాదు. ఇంగ్లాండ్‌లో అతడి ప్రదర్శన ఆధారంగా ఈ మాట చెప్పడం లేదు. కెప్టెన్సీలో అతడు అనేక తప్పుడు నిర్ణయాలు తీసుకున్నాడు. షాహీన్, బాబర్ మధ్య కెప్టెన్సీ విషయంలో విభేదాలు మొదలైన రోజు నుంచే పాకిస్థాన్ క్రికెట్ పతనం ప్రారంభమైంది'' అని బాసిత్ అలీ వ్యాఖ్యానించాడు.

### మూడో టెస్టుకు భారీ మార్పులు

తొలి రెండు టెస్టుల్లో ఘోర పరాజయాలు ఎదురవడంతో.. సిరీస్‌లో చివరిదైన మూడో టెస్టుకు పాకిస్థాన్ జట్టులో భారీ మార్పులు చేసింది. ఏకంగా ఏడుగురు ఆటగాళ్లను తప్పించి, వారి స్థానాల్లో కొత్తవారికి అవకాశం కల్పించింది. సిరీస్ మధ్యలో ఒకేసారి ఇంతమంది ఆటగాళ్లను మార్చడం అరుదైన పరిణామం. మహ్మద్ రిజ్వాన్, ఇమాముల్ హక్, సల్మాన్ ఆఘా, అలీ ఉస్మాన్, ఆమిర్ జమాల్, మహ్మద్ అవైస్, ఖుర్రమ్ షెజాద్ జట్టులో చోటు కోల్పోయారు. వారి స్థానాల్లో సయీమ్ ఆయూబ్, అబ్దుల్లా ఫజల్, అరాఫత్ మిన్హాస్, సాద్ బైగ్, మహ్మద్ రంధావా, రజావుల్లా, మహ్మద్ ఇమ్రాన్ జూనియర్‌లకు అవకాశం దక్కింది.

### కోచ్‌లపైనా వేటు

జట్టు వైఫల్యానికి బాధ్యులను చేస్తూ ప్రధాన కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లను కూడా పీసీబీ తప్పించింది. వారి స్థానాల్లో మైక్ హెసన్, ఆష్లీ నాఫ్కె బాధ్యతలు చేపట్టనున్నారు. పాకిస్థాన్–ఇంగ్లాండ్ మధ్య సిరీస్‌లో చివరిదైన మూడో టెస్టు ఈ నెల 9న ప్రారంభం కానుంది. ఈ మ్యాచ్‌లోనైనా పాక్ జట్టు పుంజుకుంటుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

## హార్దిక్ పాండ్యకు మళ్లీ గాయం!

# అఫ్గాన్‌తో టీ20 సిరీస్‌కు దూరం



**ముంబై:** గాయం నుంచి కోలుకుని తిరిగి భారత జట్టులోకి రావాలని చూస్తోన్న హార్దిక్ పాండ్యకు షాక్ తగిలింది. అతడు మళ్లీ గాయపడినట్లు తెలుస్తోంది. దీంతో సెప్టెంబరు 13 నుంచి అఫ్గానిస్థాన్‌తో జరగనున్న మూడు టీ20ల సిరీస్‌కు పాండ్య దూరమయ్యే అవకాశముంది. తొడ కండరాల గాయంతో బాధపడిన హార్దిక్ కొన్ని నెలలుగా బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఉంటున్నాడు. అతడు ఫిట్‌నెస్ సాధించాడని ఇటీవల సీవోఈ వర్గాలు చెప్పగా.. అఫ్గాన్‌తో టీ20 సిరీస్‌తో రీ ఎంట్రీ ఇస్తాడని అంతా భావించారు. అయితే, తాజాగా శిక్షణ సమయంలో హార్దిక్ కాలికి గాయమైనట్లు సమాచారం. దీంతో అఫ్గాన్‌తో సిరీస్‌కు పాండ్య అందుబాటులో ఉండటం కష్టమే. ఈ సిరీస్ కోసం భారత సెలక్షన్ కమిటీ ఈ వారంలో జట్టును ప్రకటించనుంది. దిల్లీ వేదికగా ఈ నెల 13, 15, 17 తేదీల్లో అఫ్గాన్, టీమ్ఇండియా మూడు టీ20లు జరగనున్నాయి.

## పుజారా బెస్ట్ టీమ్.. ధోని, రోహిత్‌కు దక్కని చోటు



**ముంబై:** భారత మాజీ బ్యాటర్ ఛెతేశ్వర్ పుజారా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. తన బెస్ట్ టీమ్‌ను ఎంచుకోవాలని పుజారాను కోరారు. అయితే, వారందరూ తన మాజీ సహచరులే అయి ఉండాలనే షరతు విధించారు. ఈ జాబితాలో ప్రస్తుతం ఆడుతున్న ఐదుగురు ఆటగాళ్లు.. రిటైర్ అయిన ఆరుగురిని పుజారా ఎంచుకున్నాడు. మాజీ కెప్టెన్లు మహేంద్ర సింగ్ ధోని, రోహిత్ శర్మలకు చోటు కల్పించకపోవడం గమనార్హం. అలాగే కెరీర్‌లో ఎంతోకాలం కలిసి ఆడిన అజింక్య రహానేను కూడా ఛెతేశ్వర్ తన అత్యుత్తమ జట్టులోకి తీసుకోలేదు.

పుజారా తన అత్యుత్తమ జట్టులో మాజీ బ్యాటర్లు రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్‌లను ఓపెనర్లుగా ఎంచుకున్నాడు. మూడో స్థానాన్ని తనకే ఇచ్చుకున్నాడు. నాలుగో స్థానంలో క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్‌ను తీసుకున్నాడు. ఐదో స్థానంంలో విరాట్ కోహ్లిని ఎంచుకున్న పుజారా.. ఆ తర్వాతి ప్లేస్‌ను మాజీ బ్యాటర్ వీవీఎస్ లక్ష్మణ్‌కు ఇచ్చాడు. వికెట్‌కీపర్‌గా ధోనికి బదులు రిషభ్ పంత్ వైపే మొగ్గుచూపాడు. చివరి నాలుగు స్థానాల్లో ఇద్దరు స్పిన్నర్లుగా రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్‌లను తీసుకున్నాడు. మిగిలిన రెండు స్థానాల్లో పేసర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ షమిలకు అవకాశం కల్పించాడు. 12వ ఆటగాడిగా మాజీ పేసర్ ఇషాంత్ శర్మను తీసుకున్న పుజారా.. ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా హార్దిక్ పాండ్యకు ఛాన్స్ ఇచ్చాడు.



## ముంబైతోనే హార్దిక్..

# కెప్టెన్‌గా తిలక్ వర్మ!

**ముంబై:** ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య ట్రేడింగ్‌పై కొత్త అంశం తెరపైకి వచ్చింది. హార్దిక్‌ను ట్రేడ్ చేయకుండా ఆటగాడిగా జట్టులో కొనసాగించి, కెప్టెన్సీ మరొకరికి అప్పగించాలని ముంబయి భావిస్తోందట. పాండ్యను ట్రేడ్ చేయడం కోసం కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ముంబయి ఇండియన్స్ సంప్రదించిందట. అయితే, సరైన ప్రత్యామ్నాయ ఆటగాడు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్‌గా కొత్తవారిని ఎంపిక చేసేందుకు ముంబయి కసరత్తు చేస్తోందని సమాచారం. కొత్త సారథి ఎంపికలో రోహిత్ శర్మకీలకపాత్ర పోషిస్తున్నాడని, ఇప్పటికే జట్టు యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నట్లు టాక్ నడుస్తోంది. కెప్టెన్సీ రేసులో సీనియర్ ప్లేయర్ జస్‌ప్రీత్ బుమ్రాతోపాటు యువ ఆటగాడు తిలక్ వర్మ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే, జట్టు దీర్ఘకాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తిలక్ వర్మ వైపే మొగ్గు చూపే అవకాశాలున్నాయని సమాచారం.

''హార్దిక్‌ను అసలు ట్రేడ్ చేయకపోయినా ఆశ్చర్యపోకండి. ఈ విషయమై ఆటగాడితో చర్చలు కూడా జరిగాయి. ఒక ట్రేడ్ జరగాలంటే చాలా విషయాలు ఒక కొలిక్కి రావాలి. ఇది అంత తేలికైన విషయం కాదు'' అని ఫ్రాంఛైజీ సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మహేల జయవర్ధనెను కోచ్‌గా తొలగిస్తారని మొన్నటివరకు వార్తలు వచ్చాయి. అయితే, వచ్చే సీజన్‌కు అతనే కోచ్‌గా ఉండే అవకాశముందట. చివరి నిమిషంలో ఎలాంటి మార్పులు లేకపోతే వచ్చే నెలలో అధికారిక ప్రకటన వెలువడే ఛాన్స్ ఉందని సమాచారం. సూర్యకుమార్ యాదవ్ గతేడాది మెరుగైన ప్రదర్శన చేయకపోయినప్పటికీ ఈ అనుభవజ్ఞుడైన ఆటగాడిని వదులుకునేందుకు ముంబయి సిద్ధంగా లేదని తెలుస్తోంది. ''అవును.. గత సీజన్‌లో సూర్యకుమార్ బాగా ఆడలేదు. కానీ, అంతకు ముందు సీజన్ల సంగతేంటి?కేవలం ఒక ఏడాది ప్రదర్శన ఆధారంగా ముంబయి ఇండియన్స్ ఒక ఆటగాడిని పక్కనపెట్టదు. వారు ఆ విధంగా వ్యవహరించరు. వాళ్లు 'వన్ ఫ్యామిలీ' అనే ట్యాగ్‌ను గర్వంగా భావిస్తారు. దానికే కట్టుబడి ఉంటారు'' అని సంబంధిత వర్గాలు తెలిపాయి.

## అన్ని ఫార్మాట్ల పేసర్‌గా ఎదగడమే లక్ష్యం

### బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ బౌలింగ్‌ను నిశితంగా పరిశీలిస్తున్నా

### యువ పేసర్ గుర్నూర్ బ్రార్



**ముంబై:** అన్ని ఫార్మాట్లలో భారత జట్టుకు సమర్థవంతమైన ఫాస్ట్ బౌలర్‌గా ఎదగడమే తన లక్ష్యమని యువ పేసర్ గుర్నూర్ బ్రార్ తెలిపాడు. సీనియర్ బౌలర్లు జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలతో కలిసి బౌలింగ్ చేయడం, వారి బౌలింగ్‌ను నిశితంగా పరిశీలించడం ద్వారా తనలో ఎంతో మార్పు వచ్చిందని చెప్పాడు. ముఖ్యంగా బంతిని సరైన లెంగ్త్‌లో స్థిరంగా వేయడంపై మరింత పట్టు సాధించానని పేర్కొన్నాడు. రంజీ ట్రోఫీ, ఇండియా 'ఎ' తరఫున తాను ప్రదర్శించిన ప్రతిభే భారత జట్టులో చోటు దక్కేందుకు కారణమైందని గుర్నూర్ చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టిన తర్వాత పిచ్ పరిస్థితులకు అనుగుణంగా బౌలింగ్ చేయడం, ప్రత్యర్థి బ్యాటర్‌కు తగ్గట్టుగా బంతులు సంధించడం వంటి అంశాలపై మరింత అవగాహన పెంచుకుంటున్నానని వివరించాడు.

''బౌలింగ్‌లో లెంగ్త్‌ను మరింత కచ్చితంగా నియంత్రించడంపై దృష్టి పెడుతున్నా. పిచ్ పరిస్థితులను అర్థం చేసుకుని.. ప్రతి బ్యాటర్‌కు ఎలాంటి బంతులు వేయాలో నేర్చుకుంటున్నా. మొదటి నుంచీ నాకు ఒకే లక్ష్యం ఉంది. ఎన్ని ఓవర్లు వేసినా ప్రభావం పడనంతగా నా శరీరాన్ని దృఢంగా తీర్చిదిద్దుకోవాలనుకుంటున్నా. మోర్నీ మోర్కెల్, గౌతమ్ గంభీర్ సర్‌ల సూచనలతో నా బౌలింగ్‌లో చాలా మార్పు వచ్చింది'' అని గుర్నూర్ పేర్కొన్నాడు. ఇప్పటివరకు ఆరు వన్డేలు ఆడిన గుర్నూర్ 6.96 ఎకానమీతో 11 వికెట్లు పడగొట్టి అంతర్జాతీయ కెరీర్‌ను ఆకట్టుకునేలా ప్రారంభించాడు. బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి బౌలర్లను పరిశీలిస్తూ వారి నుంచి నేర్చుకుంటున్నానని తెలిపాడు. తాను కూడా వారి మాదిరిగా అన్ని ఫార్మాట్లలో రాణించే పేసర్‌గా ఎదగడానికి ప్రయత్నిస్తున్నానని చెప్పాడు. ప్రస్తుతం గుర్నూర్ బ్రార్ నార్త్‌జోన్ తరఫున దులీప్ ట్రోఫీ సెమీఫైనల్‌లో ఆడుతున్నాడు. సౌత్‌జోన్‌తో జరుగుతున్న సెమీఫైనల్ తొలి ఇన్నింగ్స్‌లో అతడు నాలుగు వికెట్లు పడగొట్టాడు.



# జీఎస్టీ, యూపీఐ లావాదేవీలు సూపర్




**న్యూఢిల్లీ:** దేశంలో ఆర్థిక కార్యకలాపాలకు సూచికగా నిలిచే వస్తు, సేవల పన్ను, యూపీఐ లావాదేవీలు మరోసారి భారీగా నమోదయ్యాయి. ఆగస్టు నెలలో ఈ రెండూ మెరుగైన వృద్ధిని సాధించాయి. గడిచిన నెలలో జీఎస్టీ వసూళ్లు మరోసారి రూ.2 లక్షల కోట్ల మార్కు దాటగా.. యూపీఐ లావాదేవీలు రికార్డు స్థాయికి చేరువగా నమోదయ్యాయి. ఆగస్టు నెలలో జీఎస్టీ వసూళ్లు రూ.2 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే 14.8 శాతం వృద్ధి నమోదైనట్లు పేర్కొంది. ఈ మొత్తం వసూళ్లలో దేశీయ లావాదేవీల నుంచి రూ.1.37 లక్షల కోట్లు రాగా.. దిగుమతుల ద్వారా రూ.62,604 కోట్లు సమకూరినట్లు కేంద్రం తెలిపింది. సెంట్రల్ జీఎస్టీ వసూళ్లు రూ.38,413 కోట్లు కాగా, స్టేట్ జీఎస్టీ వసూళ్లు రూ.46,316 కోట్లుగా నిలిచాయి. సమీకృత జీఎస్టీ వసూళ్లు రూ.1.15 లక్షల కోట్లుగా ఉన్నాయి. రిఫండ్ల అనంతరం నికర జీఎస్టీ వసూళ్లు 8.3 శాతం వృద్ధితో రూ.1.68 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం పేర్కొంది.

### యూపీఐ లావాదేవీలు భళా

డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు ఆయువుపట్టుగా ఉన్న యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్‌ద్వారా ఆగస్టు నెలలో రూ.29.8 లక్షల కోట్ల విలువైన లావాదేవీలు జరిగినట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది. గతేడాది ఆగస్టులో ఈ మొత్తం రూ.24.85 లక్షల కోట్లుగా ఉంది. అంటే 20 శాతం వార్షిక వృద్ధి నమోదైంది. ఈ ఏడాది మే, జులై నెలల్లో రూ.29.9 లక్షల కోట్లు చొప్పున రికార్డు స్థాయిలో యూపీఐ లావాదేవీలు జరిగాయి. ఆగస్టులోనూ రికార్డు స్థాయికి చేరువ కావడం గమనార్హం. సంఖ్యాపరంగా చూస్తే జులైలో 23.66 బిలియన్ లావాదేవీలు జరగ్గా.. ఆగస్టులో ఆ సంఖ్య పెరిగి 24.51 బిలియన్‌లకు చేరింది.

# ఎల్‌ఐసీ నుంచి రెండు కొత్త ప్లాన్లు




**ముంబై:** ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసీ రెండు కొత్త ప్లాన్లను లాంచ్ చేసింది. ఎల్‌ఐసీ 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బీమా ప్లాటినమ్, జీవన్ రక్ష పేరిట రెండు కొత్త ప్లాన్లను ప్రకటించింది. సెప్టెంబర్ 7 నుంచి ఈ పాలసీలు అందుబాటులోకి రానున్నాయి.

### బీమా ప్లాటినమ్ (ప్లాన్ నం 770)

బీమా ప్లాటినమ్ నాన్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్, ఇండివిడ్యువల్ ప్లాన్. ఇది పొదుపుతో పాటు మీ కుటుంబానికి ఆర్థిక రక్షణ కూడా కల్పిస్తుంది. కచ్చితమైన ముందస్తు హామీతో కూడిన రాబడులు లభిస్తాయి. ప్రీమియం చెల్లింపు కాలవ్యవధిలో ప్రతి వెయ్యి రూపాయలకు రూ.70 చొప్పున గ్యారెంటీడ్ అడిషన్ చెల్లిస్తారు. ఈ పాలసీ తీసుకునేందుకు కనీస వయసు 28 ఏళ్లు. గరిష్ఠ వయసు 75 ఏళ్లుగా నిర్ణయించారు. 7, 10, 12, 15, 18 ప్రీమియం చెల్లింపు కాలవ్యవధిని ఎంచుకోవచ్చు. 17, 20, 22, 25, 28 ఏళ్ల పాటు పాలసీ గడువు ఉంటుంది. కనీస బీమా హామీ మొత్తం రూ.3 లక్షలుగా నిర్ణయించారు. గరిష్ఠ మొత్తంపై పరిమితి లేదు. పాలసీ మెచ్యూరిటీ సమయానికి పాలసీదారుడు జీవించి ఉంటే బేసిక్ సమ్‌అష్యూర్డ్, గ్యారెంటీడ్ అడిషన్లు చెల్లిస్తారు. జరగరానిది ఏదైనా జరిగితే వార్షిక ప్రీమియానికి 11 రెట్లు లేదా బేసిక్ సమ్ అష్యూర్డ్, గ్యారెంటీడ్ అడిషన్లలో ఏది ఎక్కువైతే అది చెల్లిస్తారు. ఎల్‌ఐసీ పాలసీదారులకు రిబేటు లభిస్తుంది. రుణ సదుపాయం కూడా ఉంది. రైడర్లు జోడించుకోవచ్చు. బేసిక్ సమ్ అష్యూర్డ్‌లో 10 శాతం చొప్పున రెగ్యులర్ ఇన్‌కమ్ కింద ఏటా తీసుకునే వెసులుబాటూ ఉంది.

### జీవన్ రక్ష (ప్లాన్ నం 894)

ఎల్‌ఐసీ జీవన్ రక్ష నాన్–పార్టిసిపేటింగ్, నాన్ లింక్డ్ ప్యూర్ రిస్క్ ప్లాన్. ఇది మీ కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పిస్తుంది. పాలసీదారుడికి జరగరానిది ఏదైనా జరిగితే అండగా నిలుస్తుంది. ఈ ప్లాన్ తీసుకోవడానికి కనీస వయసు 18 ఏళ్లు, గరిష్ఠ వయసును 45 ఏళ్లుగా నిర్ణయించారు. కనీస బీమా హామీ మొత్తం రూ.5 లక్షలు, గరిష్ఠంగా రూ.24 లక్షలు వరకు తీసుకోవచ్చు. సింగిల్ ప్రీమియం, రెగ్యులర్ ప్రీమియం, లిమిటెడ్ ప్రీమియం ఆప్షన్లలో లభిస్తుంది. మహిళలకు ప్రత్యేక రేట్లు వర్తిస్తాయి. రైడర్లు జోడించుకోవచ్చు.

## మార్కెట్‌లోకి రిలయన్స్ ఐస్‌క్రీమ్




**ముంబై:** రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఎఫ్ఎంసీజీ విభాగం రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ మరో కొత్త వ్యాపారంలోకి ప్రవేశించింది. ఇప్పటికే శీతల పానీయాల విభాగంలో ఉనికి చాటుతున్న రిలయన్స్.. తన వ్యాపారాన్ని మరింత విస్తరిస్తూ ఐస్‌క్రీమ్ మార్కెట్‌లోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా 'బాంబే క్రీమరీ' బ్రాండ్‌ను ఆవిష్కరించింది. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. డెయిరీ క్రీమ్‌తో తయారుచేసిన ఐస్‌క్రీమ్‌లను ఈ బ్రాండ్ కింద విక్రయించనున్నట్లు రిలయన్స్ వెల్లడించింది. కోన్స్, కప్స్, టబ్స్, బార్స్, స్టిక్స్ రూపంలో వీటిని విక్రయిస్తామని తెలిపింది. వీటి ధరలు రూ.10 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొంది. తొలుత పశ్చిమ రాష్ట్రాల్లో ఇవి అందుబాటులోకి వస్తాయని, క్రమంగా దేశవ్యాప్తంగా వినియోగదారులకు తేనున్నట్లు ప్రకటించింది. అందుబాటు ధరలో బాంబే క్రీమరీ ద్వారా అసలైన ఐస్‌క్రీమ్ రుచిని భారతీయులకు అందించడం తమ ముఖ్య ఉద్దేశమని రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డైరెక్టర్ టి కృష్ణ కుమార్ తెలిపారు.

## నష్టాల్లో ముగిసిన దేశీయ మార్కెట్ సూచీలు



**ముంబై:** దేశీయ మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి ముడిచమురు ధరల పెరుగుదల, బ్యాంక్, ఆటో షేర్లలో అమ్మకాలు వంటి కారణాలతో సూచీలు నష్టపోయాయి. క్రితం సెషన్‌లో 76,957 వద్ద సెన్సెక్స్ ముగియగా.. నేటి ట్రేడింగ్‌లో 76,994 వద్ద ప్రారంభమైంది. ఒక దశలో 77,231 వరకు ఎగబాకింది. చివరకు 12 పాయింట్ల నష్టంతో 76,944.28 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 24,055 వద్ద క్లోజ్ అయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 27 పైసలు పెరిగి, 94.95 వద్ద ముగిసింది. నిఫ్టీ సూచీలో ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, అదానీ పోర్ట్స్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, రిలయన్స్ షేర్లు రాణించాయి. శ్రీరామ్ ఫైనాన్స్, మారుతీ సుజుకీ, నెస్లే, మ్యాక్స్ హెల్త్‌కేర్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ షేర్లు నష్టపోయాయి.



## నాగచైతన్యపై చేతబడి.. అసలు విషయం బయట పెట్టిన మాయా బుక్!



కామెడీ కింగ్ అల్లరి నరేష్ తన వింటేజ్ కామెడీతో మరోసారి ప్రేక్షకులకు అందించేందుకు 'రంభ ఊర్వశి మేనక' చిత్రంతో వచ్చేందుకు సిద్ధం అయ్యాడు. మోహన్ చింతాడ దర్శకత్వంలో రూపొందిన ఈ మూవీలో రాశి సింగ్, విష్ణుప్రియ, ప్రిషా సింగ్‌లతో పాటు వెన్నెల కిషోర్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సెన్సార్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం కృష్ణాష్టమి స్పెషల్‌గా సెప్టెంబర్ 4న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. ఈ నవ్వుల ప్రయాణానికి మరింత కిక్ ఇస్తూ, హీరో అక్కినేని నాగచైతన్య స్వయంగా ప్రమోషన్‌లోకి దిగి, సినిమా హీరో అల్లరి నరేశ్‌తో చేయి కలిపి సందడి చేశారు. ఈ మేరకు అల్లరి నరేశ్.. ఓ మాయా బుక్‌పై రంభాయ నమః, ఊర్వశాయ నమః, మేనకాయ నమః, అన్నపూర్ణ స్టూడియోసాయ నమః, కింగ్ నాగార్జునాయ నమః, నాగచైతన్యాయ నమః' అని రాస్తుండగా.. ఇంతలో నాగచైతన్య వచ్చి.. 'ఏంటీ నరేష్ తెగ కష్టపడిపోతున్నావు.. నా మీద చేతబడి చేస్తున్నావా' అంటూ వాళ్లిద్దరు ఫన్నీగా చర్చించుకుంటూ సినిమా రిలీజ్ డేట్‌ను అనౌన్స్ చేసి.. సెప్టెంబర్ 4న తప్పకుండా నవ్వుల విందు కోసం థియేటర్స్‌కు రండీ అని చెప్పడం నవ్వులు పూయిస్తుంది.



## ఎంపీ చేతుల మీదుగా చకోర సాంగ్ రిలీజ్

శ్రవణ్, మలైకా టి వాసుపల్ జంటగా నటిస్తున్న సినిమా చిత్రం 'చకోర– లూనార్ లవ్ బర్డ్'. వీఐపీ వింటేజ్ ఐకానిక్ పిక్చర్స్ సారథ్యంలో హై జాయ్ కమర్షియల్స్ బ్యానర్‌పై ప్రొడ్యూసర్ డా.చింతాడ హేమారావు నిర్మిస్తున్న ఈ మూవీతో ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ దగ్గర ఫస్ట్ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన మంగా శ్రీనివాస్ నూతన దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ మూవీ అక్టోబర్ 8న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధం అవుతుండగా.. మ్యూజికల్ జర్నీ స్టార్ట్ చేశారు మేకర్స్. ఈ మేరకు ఈ చిత్రం నుంచి 'అద్దంలా చేయనా..' సాంగ్‌ను అనకాపల్లి ఎంపీ సి.ఎం. రమేష్ చేతుల మీదుగా రిలీజ్ చేయించారు మేకర్స్. సాంగ్ రిలీజ్ చేసిన ఎంపీ సి.ఎం రమేష్ సినిమా టీమ్‌కు బెస్ట్ విశెస్ తెలియజేశారు. ప్రిన్స్ హెన్రీ బ్యూటిఫుల్‌గా కంపోజ్ చేసిన ట్యూన్‌కు కాసర్ల శ్యామ్ క్యాచీ లిరిక్స్ అందించారు. సాయి చరణ్ భాస్కరుణి అందంగా పాడారు. ఇక ఎలా ఉందో చూస్తే.. అద్దంలా చేయనా చిట్టి గుండెని, అందంగా దాచేయంగ జాబిలమ్మని, అరచేత నింపనా చిన్ని ప్రేమని, గీతంగా మార్చేయంగ వెన్నెలమ్మని.. అంటూ ప్రేమికుడి గుండెల్లోని భావాలను అందంగా వెల్లడిస్తూ ఆకట్టుకుంటోందీ పాట.

# నా కెరీర్‌లో ఇది చాలా స్పెషల్

### 'హుంకార్' టీజర్ షేర్ చేస్తూ అనీత్ పడ్డా ఎమోషనల్ పోస్ట్

బాలీవుడ్ యంగ్ అండ్ టాలెంటెడ్ నటి అనీత్ పడ్డా వరుస ప్రాజెక్టులతో దుమ్మురేపుతోంది. మోహిత్ సూరి దర్శకత్వంలో వచ్చిన 'సైయారా' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి ఓవర్ నైట్ స్టార్‌గా మారారు. ఇందులో అహాన్ పాండే సరసన చేసి మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ, ఇప్పుడు ఒక పవర్‌ఫుల్ కోర్ట్‌రూమ్ డ్రామాతో అలరించేందుకు సిద్ధమైంది. అనీత్ పడ్డా ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా వెబ్ సిరీస్ 'హుంకార్: ది రోర్'. కరణ్ డి కపాడియా, నిత్యా మెహ్రా దర్శకత్వం వహించిన ఈ సిరీస్‌లో ఫాతిమా సనా షేక్, అర్జున్ మాథుర్, రామ్ కపూర్ కీలక పాత్రలో నటించారు. అనీత్ పడ్డా సరికొత్త కోణంలో కనిపించబోతున్న ఈ హుంకార్ సిరీస్ సెప్టెంబర్ 25 నుంచి 'జియో హాట్‌స్టార్'లో స్ట్రీమింగ్ కానుంది.

ఈనేపథ్యంలో.. తాజాగా, ఈ సిరీస్ టీజర్‌ను మేకర్స్ విడుదల చేయగా, అనీత్ పడ్డాకు సంబంధించిన సీన్లు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి.

ఈ కథ మొత్తం ఒక పవర్‌ఫుల్ బాబా వ్యవస్థను ప్రశ్నించే ధైర్యవంతమైన అమ్మాయి చుట్టూ తిరుగుతుందని తెలుస్తోంది. టీజర్ ప్రారంభంలోనే 17 ఏళ్ల స్కూల్ స్టూడెంట్ మీనూ రావత్‌గా అనీత్ పడ్డా ఎంట్రీ ఆకట్టుకుంటుంది. బాప్జీ శబరి ఫోర్ట్ ఆశ్రమంలో తనపై జరిగిన అకృత్యాన్ని, వేధింపులను పోలీస్ స్టేషన్‌లో ధైర్యంగా చెప్తూ అనీత్ ఇచ్చే ఎక్స్‌ప్రెషన్స్ అందరినీ ఆలోచింపజేస్తున్నాయి. ఒక చిన్న ఆరోపణ ఒక పెద్ద వ్యవస్థను ఎలా ఊపేసింది, మీడియా, కోర్టు, పోలీసుల మధ్య నడిచే మూడు రకాల పోరాటాలు ఎలా సాగాయనేది ఈ సిరీస్ సారాంశం. కాగా.. ఈ వెబ్ సిరీస్ గురించి అనీత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ.. 'సైయారా' కంటే ముందే ఈ సిరీస్ షూటింగ్ పూర్తి చేశానని, ఇది తన ప్రయాణంలో చాలా ప్రత్యేకమైన ప్రాజెక్ట్ అని తెలిపింది. హుంకార్ కొంతకాలంగా తన ప్రయాణంలో ఒక భాగం అయిందని.. చివరకు దీన్ని అందరితో పంచుకుంటున్నందుకు తనకు చాలా సంతోషంగా ఉందని చెప్పింది. నిరీక్షణ ఉండదని.. కేవలం 'హుంకార్' నిజాన్ని నమ్మడమే అని రాసుకొచ్చింది.



## నటనలోనూ ఉపయోగపడింది నా డాక్టర్ చదువు: శ్రీలీల

తన వైద్యవిద్య అనుభవాలు ఒక నటిగా తనను ఎంతగానో ప్రభావితం చేశాయని అంటోంది యువ కథానాయిక శ్రీలీల. ఈమె నటిగానే కాకుండా.. వైద్యురాలిగా కూడా అందరికీ సుపరిచితమే. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రీలీలకు.. వైద్యవిద్య అనుభవం సినిమా రంగంలో ఏమైనా ఉపయోగపడిందా? అనే ప్రశ్న ఎదురైంది.

దీనికి సమాధానంగా.. ''నూటికి నూరు శాతం వైద్య విద్య నా నటనకు ఉపయోగపడింది. నటీనటులు ప్రపంచంలోని ప్రతి విషయం గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఇతరుల పట్ల సున్నితంగా స్పందించే గుణం కూడా ఉండాలి. నా మెడికల్ కోర్సులో భాగంగా ఆసుపత్రికి వెళ్లినప్పుడు ఎన్నో నిజ జీవిత కథలను, ప్రజల భావోద్వేగ ప్రయాణాలను చాలా దగ్గరగా చూశాను. అక్కడ మీకు జీవితం, మరణం రెండూ కనిపిస్తాయి. ఆసుపత్రి బిల్లులు చెల్లించడానికి ఆర్థిక ఇబ్బందులు పడే మనుషులను చూస్తారు. ఇలాంటివి ఎన్నో కథలు ఉంటాయి. అసలు సినిమా అంటే ఏంటి? అది కూడా ఒక కథే కదా! చిత్రపరిశ్రమ ఒక రంగుల ప్రపంచం. ఇక్కడ డ్యాన్సులు, అద్భుతమైన కాస్ట్యూమ్స్ ఉంటాయి. మరోవైపు తెల్లకోటు వేసుకొని జీవితం, మరణాన్ని చూడటం పూర్తి భిన్నమైన అనుభవం. ఈ అనుభవాలే నన్ను నటిగా మరింత పరిణతి చెందేలా తీర్చిదిద్దాయ''ని చెప్పుకొచ్చింది శ్రీలీల.



## తుపానులా విరుచుకుపడే 'మైసా'

''ఆ కోపం.. ఆ ఆవేదన! ఆ గుండె కోత.. ఆ దుఃఖం! ఆ పట్టుదల.. ఆ ధైర్యం! ఊహించని తుపానులా విరుచుకుపడే ఆ శక్తే 'మైసా'' అంటోంది నటి రష్మిక. ఇది ఆమె టైటిల్ పాత్రలో నటిస్తున్న నాయికా ప్రాధాన్య సినిమా. రవీంద్ర పుల్లె తెరకెక్కిస్తున్నారు. అన్ ఫార్ములా ఫిల్మ్స్ నిర్మిస్తుంది. ముగింపు దశలో ఉన్న ఈ చిత్రాన్ని నవంబరు 27న పాన్ ఇండియా భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం విడుదల తేదీతో కూడిన కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. రష్మిక అందులో చేతిలో ఈటె పట్టుకుని రక్తంతో తడిచిన శరీరంతో రౌద్ర రూపంలో కనిపించింది. విభిన్నమైన యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో.. రష్మిక శక్తిమంతమైన గిరిజన గోండు మహిళ పాత్రలో అలరించనుంది. గాయం కారణంగా గత కొన్ని వారాలుగా విశ్రాంతిలో ఉన్న ఆమె ఇప్పుడు తిరిగి కోలుకోవడంతో ఈ చిత్ర సెట్స్‌లోకి అడుగు పెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ సినిమాకి జేక్స్ బిజోయ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.


## 'ప్రేమలు' సినిమాతోనే బంధం బలపడింది!

''తెలుగు ప్రేక్షకులతోనూ, హైదరాబాద్‌తోనూ నా బంధం బలపడింది 'ప్రేమలు' సినిమా కారణంగానే! అలాంటి మరో అందమైన చిత్రమే 'బెత్లెహామ్ కుటుంబ యూనిట్'. తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు ప్రముఖ కథానాయకుడు ఫహాద్ ఫాజిల్. ఆయన మలయాళంలో దిలీశ్ పోతన్, శ్యామ్ పుష్కరణ్‌తో కలిసి నిర్మించిన చిత్రమే 'బెత్లెహామ్ కుటుంబ యూనిట్'. గిరీశ్.ఎ.డి దర్శకుడు. 'ప్రేమలు' తర్వాత ఆ దర్శకనిర్మాతలంతా కలిసి రూపొందించిన చిత్రమిది. నివిన్ పౌలీ, మమితా బైజు జంటగా నటించారు. మలయాళంలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న ఈ చిత్రం తెలుగులో ఈ నెల 4న మైత్రీ మూవీ సంస్థ నుంచి ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు.

దర్శకుడు మాట్లాడుతూ ''తెలుగు ప్రేక్షకులంటే నాకెంతో గౌరవం. మా 'ప్రేమలు' సినిమాని గొప్పగా ఆదరించారు. అదే తరహాలోనే అందరికీ నచ్చే అందమైన సినిమా ఇది'' అన్నారు. కథానాయకుడు నివిన్ పౌలి మాట్లాడుతూ ''తెలుగులో విడుదలవుతున్న నా తొలి సినిమా ఇది. మలయాళంలో గొప్పగా ఆదరణ పొందుతోంది. హాస్యంతో మంచి అనుభూతిని పంచే ఒక రొమాంటిక్ కథ ఇది. అందరికీ నచ్చేసే ఒక సింపుల్ సినిమా ఇది'' అన్నారు.

ఫహాద్' ఫాజిల్ మాట్లాడుతూ ''ఈమధ్య హైదరాబాద్‌కి తరచూ వస్తున్నా. ఇది నాకు మరో ఇల్లు అయిపోయింది. మంచి స్నేహితులు ఉన్నారు. 'ప్రేమలు' తర్వాత మరో బలమైన సినిమాతో రావాలని నిర్ణయించుకున్నాం. ఇది చాలా ప్రత్యేకమైన సినిమా. తెలుగులో కచ్చితంగా విడుదల చేయాలనుకున్నాం'' అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్‌తోపాటు పంపిణీదారుడు శశిధర్ రెడ్డి, చిత్రబృందం పాల్గొంది.






Printed, Published & Owned by YAMJALA PRAVEEN, Printed at SRI VENKATESWARA PRINTING SOLUTIONS, 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published From 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, and Telangana - 508252. Editor: YAMJALA PRAVEEN, PRGI.No. TGTEL/26/A6221, Ph.No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website : www.tholivelugu.com